
పొత్తూరు లక్ష్మీభవానీ మృత్యుంజయశర్మ M.A.
తెలుగు పండిట్, ఆగమవర
శ్రీ భ్రమరాంబా ఆస్ట్రో సెంటర్
శివాలయం రోడ్, పెదకాకాని.
సెల్ : 9290570278, 8074884835

ప్రజా చైతన్యమే...

# లక్ష్యం

తెలుగు దినపత్రిక

email : lakshyam2013@gmail.com

ఎడిటర్ ఇన్ చీఫ్ - మధుసూదనరావు చల్లా

R.N.I. No. APTEL/2013/48712

ప్రొ॥ తోటకూర జ్యోతి
Cell: 93900 68329
99125 83022
రైతు మిల్క్ డైరీ
మావద్ద : పాలు, పెరుగు, వెన్న, నెయ్యి, పన్నీరు, పాల పదార్థములు లభించును.
వివాహాది శుభకార్యములకు ఆర్డర్లపై సప్లయి చేయబడును.
జనసేనా పార్టీ ఆఫీస్ వద్ద, బైపాస్‌రోడ్, లాల్‌పురం, గుంటూరు రూరల్.
'కుండ పెరుగు' మా ప్రత్యేకత


ఎడిటర్ ఇన్ చీఫ్-మధుసూదనరావు చల్లా
Cell : 6302222748, 9492569010

Simultaneously circulated in Amaravathi, Hyderabad, Vijayawada, Nellore, Ongole, Guntur, Krishna, Chittoor, Kadapa & all Districts of Andhra Pradesh & Telangana.

సంపుటి : 12 సంచిక : 163 సోమవారం 21-07-2025 పేజీలు : 8 వెల :3/-

LEGAL AFFAIRS
All legal Affairs About Lakshyam Telugu Daily, Should be filled in Guntur Courts Only

# మద్యం స్కాంలో బిగ్ వికెట్..!

- వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు.. రిమాండ్...!
- లిక్కర్ ఛార్జ్‌షీట్‌లో జగన్ పేరు - అక్కడే అసలు ట్విస్ట్, ఏం జరగనుంది..!?
- రాజమండ్రి సెంట్రల్ జైలుకు మిథున్
- రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు..!!

విజయవాడ, జులై 20 (లక్ష్యం ప్రధాన ప్రతినిధి) : రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వంలో రూ.3500 కోట్ల విలువైన మద్యం కుంభకోణం జరిగిందని భావిస్తున్నతరుణంలో వైసీపీ కీలక ఎంపీ, పార్టీ అధినేత వైఎస్ జగన్ కు సన్నిహితుడైన పీవీ మిథున్ రెడ్డిని సీఐడీ సిట్ అధికారులు అరెస్టు చేసి, విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు. ఇప్పటికే సుప్రీంకోర్టు మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ తిరస్కరించి అరెస్టు నుంచి రక్షణ కల్పించలేమని తేల్చిచెప్పడంతో గత రెండు రోజులుగా సీఐడీ అధికారులు మిథున్‌రెడ్డిని ఏడు గంటలపాటు విచారించి, శనివారం రాత్రి అరెస్టు ప్రకటించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాజంపేట ఎంపీగా ఉన్న పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి మద్యం విధానం రూపకల్పనలో కీలక పాత్ర పోషించారని, ఆ తర్వాత మద్యం కంపెనీల నుంచి ముడుపుల వసూళ్లు, వాటి తరలింపుల విషయంలోనూ ప్రధానంగా ఉన్నారని సిట్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన్ను అరెస్టు చేసేందుకు ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తోంది. అయితే తొలుత హైకోర్టులో ముందస్తు బెయిల్ కోరిన మిథున్ రెడ్డికి నిరాశ తప్పలేదు. దీంతో సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది.



మద్యం స్కాం కేసులో ఏ4గా మిథున్ రెడ్డిని చేర్చిన సిట్ అధికారులు శనివారం ఉదయం నుంచి దాదాపు ఏడు గంటల పాటు విచారించారు. అనంతరం అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కేసులో ఇప్పటికే రాజ్ కెసిరెడ్డి, ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప వంటి వారిని అరెస్టు చేసిన పోలీసులు.. ఇప్పుడు మిథున్ రెడ్డిని కూడా అరెస్టు చేశారు. దీంతో మద్యం కుంభకోణంలో దాదాపుగా కీలక నిందితులందరినీ అరెస్టు చేసినట్లయింది. మరోవైపు శనివారం సీఐడీ కోర్టులో మద్యం స్కాంపై 300 పేజీలతో ప్రాథమిక ఛార్జిషీట్ దాఖలు చేసిన సిట్ అధికారులు.. మిథున్ రెడ్డి పేరును మాత్రం ప్రస్తావించకపోవడంతో దాదాపుగా ఆయన అరెస్టు ఉండకపోవచ్చని రాజకీయవర్గాలు భావించాయి. అనూహ్య పరిణామాల మధ్య మిథున్‌రెడ్డిని ఆదివారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా ఆయనకు ఆగస్టు 1వ తేదీ వరకూ రిమాండ్ విధించడంతో కేసు కీలక మలుపు తిరిగినట్లు అయ్యింది. మద్యం కేసులో

మిగితా 2లో



## రాజకీయాలు మా ఇంట్లోకి రావు... ఆఫీసులో పర్సనల్ మ్యాటర్స్ రావు

- ఇండియా టుడే పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న నారా లోకేశ్
- ఆసక్తికర విషయాలు పంచుకున్న మంత్రి
- ఐదేళ్ల కుటుంబ వ్యాపారంలో పనిచేసిన తర్వాతే రాజకీయాల్లోకి వచ్చానని వెల్లడి

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ 'ఇండియా టుడే' పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికర అంశాలు పంచుకున్నారు., ఇంట్లో, ఆఫీస్‌లో తన తండ్రి చంద్ర బాబును ఎలా పిలుస్తారనే విషయంపై స్పందించారు. "కింద ఫ్లోర్‌లో ఉంటే ఆయన నా బాస్. పై ఫ్లోర్‌లో ఉంటే ఆయన నా నాన్న. రాజకీయాలు ఇంట్లోకి రావు, ఆఫీస్‌లోకి పర్సనల్ మేటర్స్ రావు. అవి మేము గీసుకున్న కచ్చితమైన హద్దులు. ఇంట్లో ఉన్నప్పుడు ఆయనను నాన్నా అని పిలుస్తాను. తన కెరీర్ లో తల్లి నారా భువనేశ్వరి పాత్రను కూడా ప్రస్తావించారు. "మా అమ్మ నా పట్ల చాలా బాధ్యతాయుతంగా వ్యవహరించింది. నా ఎదుగుదల కోసం అన్ని రకాలుగా త్యాగం చేసింది. నా చదువు, కెరీర్ మరియు ఇతర అంశాల్లో నాకు మార్గదర్శనం చేసింది" అని వివరించారు. ఇక తమ కుటుంబ వ్యాపారంలో ఐదు సంవత్సరాలు పనిచేసిన తర్వాతే తాను రాజకీయాల్లోకి వచ్చానని లోకేశ్ చెప్పారు. అప్పటినుంచి ఫుల్ టైమ్ రాజకీయవేత్తగా కొనసాగుతున్నానని తెలిపారు.

## గోదావరిలో పులస - అకాశాన్ని అంటుతున్న ధర



**యానాం :** గోదావరి నదికి వరదలు వస్తుండడంతో యానాంలో పులసల సందడి కొనసాగుతోంది. ప్రస్తుతం వేలంలో పులస చేపలు భారీ ధర పలుకుతున్నాయి. ఈరోజు కిలో పులస చేప వేలంలో 22 వేల భారీ ధర పలికింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ధర కావడం విశేషం. ఈ చేపను ఓ మత్స్యకార మహిళ కొనుగోలు చేశారు. ఆ పులసను ఆమె మరింత లాభంకు అమ్ముకోనుంది. ఈ సీజన్‌లో పులస చేపల కోసం చాలా మంది ఆసక్తి కనబర్చడం కారణంగానే భారీ ధర పలుకుతున్నాయట. ఈ సీజన్‌లో తొలి పులస చేప యానాం ఫిష్ మార్కెట్‌లో రూ.4000 ధర పలికింది. పులస ప్రియులు వేలంలో పోటీ పడడంతో మరో చేప రూ.15000 పలికింది. గత వారంలో దొరికిన రెండు పులస చేపలు రూ.13 వేలు, రూ.18 వేలుగా అమ్ముడయ్యాయి. తాజాగా ఏకంగా రూ.22 వేల ధర పలికింది. యానాంలో పులసల సందడి మరికొన్ని రోజుల పాటు

మిగితా 2లో

## భారత్ మరో కీలక ఘనత... మలేరియా నివారణకు స్వదేశీ వ్యాక్సిన్

- భారతీయ పరిశోధన సంస్థల కీలక ముందడుగు
- 'అడ్‌ఫాల్సివాక్స్' పేరిట స్వదేశీ మలేరియా వ్యాక్సిన్ అభివృద్ధి
- సంప్రదాయ వ్యాక్సిన్‌లతో పోల్చితే విస్తృత రక్షణ




భారత్ మలేరియా నిర్మూలన దిశగా కీలక ముందడుగు వేసింది. భారత వైద్య పరిశోధన మండలి భువనేశ్వర్‌లోని రీజనల్ మెడికల్ రీసెర్చ్ సెంటర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మలేరియా రీసెర్చ్ మరియు డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీ ( సంయుక్తంగా 'అడ్‌ఫాల్సివాక్స్' అనే స్వదేశీ మలేరియా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేస్తున్నాయి. ఈ వ్యాక్సిన్ ను మలేరియాకు కారణమయ్యే అత్యంత ప్రమాదకరమైన ప్లాస్మోడియం ఫాల్సిపారమ్ పరాన్నజీవి యొక్క రెండు కీలక దశలను లక్ష్యంగా చేసుకుని రూపొందించారు. ప్రీ-క్లినికల్ పరీక్షల్లో ఈ వ్యాక్సిన్ అద్భుతమైన ఫలితాలను చూపింది. ఇది ప్లాస్మోడియం ఒకే దశను లక్ష్యంగా చేసుకునే సాంప్రదాయ వ్యాక్సిన్‌లతో పోలిస్తే

మిగితా 2లో



## రష్యాలో భారీ భూకంపం.. సునామీ హెచ్చరికలు

- భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదు
- కమ్చట్కా ద్వీపకల్పానికి సునామీ హెచ్చరికలు జారీ
- ముందు జాగ్రత్తగా పౌరులు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని అధికారుల సూచన

**రష్యా :** రష్యాలో భారీ భూకంపం సంభవించింది. రష్యా తీరంలో సంభవించిన ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. పెట్రోపవ్‌లావ్‌స్కీ-కామ్చాట్కా నగరానికి 144 కిలోమీటర్ల దూరంలో పసిఫిక్ మహాసముద్రంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అంతకుముందు దాదాపు గంట వ్యవధిలోనే ఈ ప్రాంతంలో ఐదు భూకంపాలు నమోదైనట్లు యూఎస్‌జీఎస్ తెలిపింది. వీటిలో 7.4 తీవ్రతతో కూడిన భూకంపం వల్ల సునామీ వచ్చే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. దీంతో కమ్చట్కా ద్వీపకల్పానికి పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం సునామీ హెచ్చరికలు జారీ చేసింది. అయితే, ఆస్తినష్టం, ప్రాణనష్టం గురించి ఇప్పటివరకు ఎలాంటి సమాచారం అందలేదు. ముందు జాగ్రత్తగా పౌరులు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిందిగా అధికారులు సూచించారు.

## రాజకీయ లబ్ధి కోసం విద్వేషాలు సృష్టించడం సులభం: కెటిఆర్



- దేశానికి జాతీయ భాష అవసరం లేదు: హిందీ భాషా రగడపై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు
- జైపూర్ లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్
- హిందీ జాతీయ భాష కాదని, దేశంలో అనేక అధికార భాషలున్నాయని వెల్లడి
- హిందీని బలవంతంగా రుద్దుతామంటే కుదరదని స్పష్టీకరణ

**జైపూర్:** నియోజకవర్గాల పునర్విభజనపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణ భారతదేశానికి నష్టం జరగవద్దని పేర్కొన్నారు. జనాభ నియంత్రణను అద్భుతంగా పాటించిన దక్షిణాదికి నష్టం వాటిల్ల వద్దన్నారు. జైపూర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. "బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై విమర్శలు వస్తున్నాయి. రాజకీయ లబ్ధి కోసం విద్వేషాలు సృష్టించడం చాలా సులభం. ప్రజలు రోడ్డెక్కి ధర్నా చేయనంత మాత్రాన అంత సవ్యంగా ఉందని అనుకోవద్దు. ప్రజలు రాజకీయ పార్టీలు, వ్యవస్థలపై చాలా అసంతృప్తిగా ఉన్నారు" అని అన్నారు. హిందీ భాష గురించి కెటిఆర్ మాట్లాడుతూ.. "భాష అనేది మాట్లాడటానికే కాదు.. అది ఒక సంస్కృతికి గుర్తింపు. భారతదేశంలో 22 అధికార భాషలు ఉన్నాయి. 300 అనాధికార భాషలు

మిగితా 2లో

## దివ్యాంగులకు టిడిపి ఫించన్లు పెరిగాయి: నిమ్మల



**అమరావతి:** ఎపిలో ధర్మారావు ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులు, వృద్ధులను దత్తత తీసుకున్నానని ఎపి మంత్రి నిమ్మల రామానాయుడుతెలిపారు. కేంద్రమంత్రి శ్రీనివాసవర్మతో కలిసి దివ్యాంగుల సహాయ పరికరాల శిబిరం పరిశీలించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో నిమ్మల పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రతినెలా 10 కిలోల బియ్యం, దుస్తులు, వైద్య సదుపాయం అందించనున్నామని అన్నారు. దివ్యాంగులకు టిడిపి ఫించన్లు పెరిగాయని, దివ్యాంగులకు పింఛన్లు రూ. వేల నుంచి రూ. 6 వేలకు పెంచాం అని నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.



## జగన్ లిక్కర్ మాఫియాతో కోటి కుటుంబాలు నాశనం- మాణికం ఠాగూర్

**విజయవాడ :** వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మద్యం మాఫియా ఆంధ్రప్రదేశ్‌లో ఒక కోటి పేద కుటుంబాలను నాశనం చేసిందని కాంగ్రెస్ పార్టీ ఏపీ వ్యవహారాల ఇంఛార్జి మాణికం ఠాగూర్ ఆరోపించారు. ఏపీ లిక్కర్ స్కామ్‌పై ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా సుదీర్ఘ పోస్టు పెట్టారు. విశ్వసనీయ మద్యం బ్రాండ్ల స్థానంలో తక్కువ గ్రేడ్, హానికరమైనవి వచ్చాయని, నాసిరకం మద్యంతో రూ. 3,200 కోట్లు కొల్లగొట్టారని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

"విశ్వసనీయ మద్యం బ్రాండ్ల స్థానంలో తక్కువ గ్రేడ్, హానికరమైనవి వచ్చాయి. నాసిరకం మద్యంతో రూ. 3,200 కోట్లు కొల్లగొట్టారు. మిథున్ రెడ్డి కేవలం బంటు. నిజమైన సూత్రధారులు మిస్టర్ అండ్ మిసెస్ జగన్. ఇది యాదృచ్ఛికంగా జరిగిన

మిగితా 2లో

# మద్యం స్కాంలో బిగ్ వికెట్..!





ఛార్జిషీట్ దాఖలుకు 90 రోజుల గడువు పూర్తి కావస్తుండటంతోనే ఈసారికి ఆయన పేరు ప్రస్తావించలేదు. అయితే మరో 20 రోజుల్లో రెండవ చార్జిషీట్ దాఖలు చేయబోతున్నారు. అందులో కచ్చితంగా మిథున్ రెడ్డి పేరు చేర్చనున్నారు.

**మద్యం స్కాంపై 300 పేజీలతో తొలి ఛార్జిషీట్..!**

మద్యం స్కాం ఎలా జరిగింది ? నిందితులు ఎవరు ? సాక్షులెవరు ? ఇతర వివరాలతో మొత్తం 300 పేజీల అభియోగపత్రాన్ని కోర్టులో శనివారం దాఖలు చేశారు. అయితే ఇందులో విచిత్రంగా ఈ కేసులో ఏ4గా ఉన్న వైసీపీ ఎంపీ పీవీ మిథున్ రెడ్డి పేరు మాత్రం లేదు.

వైసీపీ హయాంలో జరిగినట్లుగా చెప్తున్న మద్యం స్కాం విలువ రూ.3500 కోట్లుగా అధికార కూటమి ఆరోపిస్తున్న నేపథ్యంలో 62 కోట్ల మొత్తాన్ని ఇప్పటివరకూ సీజ్ చేసినట్లు ఛార్జిషీట్ లో పేర్కొన్నారు. 100కు పైగా ఫోరెన్సిక్ నివేదికలు ఇందులో పొందుపర్చినట్లు తెలుస్తోంది. ఈ కేసులో 268 మంది సాక్ష్యుల్ని విచారించినట్లు సీఐడీ సిట్ తెలిపింది. అలాగే ఈ కేసులో డబ్బు ఎవరెవరి నుంచి చేతులు మారిందనే అంశాల్ని ప్రాథమికంగా వెల్లడించినట్లు తెలుస్తోంది. మరోవైపు మద్యం స్కాంలో ఏ4గా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి నిన్న సుప్రీంకోర్టులో ఊరట లభించకపోవడంతో విజయవాడ వచ్చి సిట్ ముందు విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో మిథున్ రెడ్డి పాత్రపై ముందుగా సిద్ధం చేసిన ప్రశ్నలనే అడిగినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా షెల్ కంపెనీల నుంచి అంతిమ లబ్దిదారుకు స్కాం సొమ్ము ఎలా చేర్చారన్న దానిపై మిథున్ రెడ్డిని ప్రశ్నించారు. దీనికి మిథున్ రెడ్డి సమాధానాలు రాబట్టుకున్న సీఐడీ శనివారం రాత్రి అరెస్టు చేసినట్లు ప్రకటించారు.

**లిక్కర్ ఛార్జ్‌షీట్‌లో జగన్ పేరు - అక్కడే అసలు ట్విస్ట్, ఏం జరగనుంది..!?**

ఏపీ రాజకీయాల్లో కీలక మలుపు. సంచలనంగా మారిన లిక్కర్ ఛార్జ్ షీట్ లో సిట్ పలు మార్లు మాజీ సీఎం జగన్ పేరు ప్రస్తావన చేసింది. కోర్టుకు సమర్పించిన ప్రాథమిక ఛార్జ్ షీట్ లో వైసీపీ హాయంలో మద్యం పాలసీ పైన తీసుకున్న నిర్ణయాల నుంచి ఎఫ్ఎస్ఎల్ నివేదికల వరకు పూర్తి సమాచారం పొందుపర్చింది. 268 మంది వాంగ్మూలాలు.. నిందితుల స్టేట్ మెంట్లను అందులో వివరించింది. కాగా, ఇదే కేసులో మిథున్ రెడ్డిని అరెస్ట్ చేసారు. ఇప్పుడు జగన్ పేరు ప్రస్తావనతో నెక్ట్ జరిగేదేంటి. ఇప్పుడు ఈ చర్చ ఆసక్తి కరంగా మారుతోంది.

జగన్ పేరు ప్రస్తావన లిక్కర్ కేసులో సిట్ తొలి ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. ఈ ఛార్జ్ షీట్ లో మిథున్ రెడ్డి పేరు లేదని తెలుస్తోంది. అదే విధంగా ఇప్పటికే అరెస్ట్ అయిన ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి,బాలాజీ గోవిందప్ప పేర్లు కనిపించ లేదు. తదుపరి చార్జిషీట్లో చేరుస్తామని సిట్ చెబుతోంది. 20 రోజుల్లో మరో ఛార్జ్ షీట్ దాఖలు చేయనున్నారు. అయితే, ఏసీబీ కోర్టులో దాఖలు చేసిన ప్రాథమిక ఛార్జ్ షీట్ లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేరును పలుచోట్ల ప్రస్తావించినట్లు తెలిసింది. శని వారం అరెస్టు చేసిన వైసీపీ ఎంపీ



మిథున్ రెడ్డి పేరును కూడా చార్జిషీటులో సిట్ ప్రస్తావించినట్లు సమాచారం. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, ఐటీ సలహాదారు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి(ఏ-1) అప్పటి ఎక్సైజ్ అధికారులు, డిస్టిలరీల యజమానులతో కలిసి మిథున్‌రెడ్డి (ఏ-4) ఈ కుంభకోణాన్ని ఎలా నడిపించారనేది కోర్టుకు సిట్ వివరించింది.కీలక ఆధారాలు కాగా, సీఎం మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, జగన్ మాజీ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, భారతి సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ సహా 22మంది పాత్రని చార్జిషీట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. అతి త్వరలో మరో చార్జిషీట్ దాఖలు చేయబోతున్నామని, అందులో మరికొందరి నిందితుల పాత్రని ఆధారాలతో సహా చూపుతామని సిట్ వర్గాలు చెబుతున్నాయి. విచారణలో భాగంగా సేకరించిన ఆధారాల గురించి వివరించారు. లిక్కర్ పాలసీ రూపకల్పన నుంచి వసూళ్ల నెట్‌వర్క్ ఏర్పాటు, ఆదాన్ డిస్టిలరీని స్వాధీనం చేసుకుని పాలసీకి భిన్నంగా రూ.1200కోట్ల మద్యం ఆర్డర్లు పొందిన వైనం, వసూలు చేసిన మొత్తాన్ని రూటింగ్ చేసిన తీరుపై వివరంగా పేర్కొన్నట్లు తెలిసింది. ఎక్సైజ్ అధికారుల తో పాటు సాక్షులు ఇచ్చిన 268 స్టేట్‌మెంట్లు చార్జిషీట్‌తో పా టు కోర్టుకు అందజేసిన సిట్ అధికారులు, లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన రూ.62.85 కోట్లు జప్తు చేసినట్లు తెలిపింది.

వాట్ నెక్ట్స్ ఛార్జ్ షీట్ లో జగన్ పేరు పలు మార్లు ప్రస్తావించారు. అయితే ఈ అభియోగపత్రంలో ఆయన్ను నిందితుడిగా చేర్చలేదు. దర్యాప్తు కొనసాగుతున్నందున తదుపరి దశలో దాఖలు చేయబోయే అనుబంధ అభియోగపత్రాల్లో జగన్ ప్రమేయంపై ఇంకా స్పష్టత రానుంది. తాజాగా మరో 8 మంది ని నిందితులుగా పేర్కొన్నారు. మొత్తం 16 మందిపై అభియోగాలు మోపారు.

ఇక, ఇప్పుడు జగన్ పేరు ఛార్జ్ షీట్ లో జగన్ పేరు ప్రస్తావన ద్వారా ఈ కేసు కీలక మలుపు తీసుకునే అవకాశం కనిపి స్తోంది. సిట్ దాఖలు చేసే తదుపరి ఛార్జ్ షీట్ తో పాటుగా తాజా నోటీసులు... విచారణల పైన ఉత్కంఠ పెరుగుతోంది. వచ్చే నెల రోజుల్లో ఈ కేసుల్లో చోటు చేసుకునే పరిణామాలు రాజకీయంగా నూ కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది.

**రాజమండ్రి సెంట్రల్ జైలుకు మిథున్ - రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు..!!**

లిక్కర్ కేసులో అరెస్ట్ అయిన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. వచ్చే నెల 1వ తేదీ వరకు రిమాండ్ కు ఆదేశించింది. మిథున్ ను రాజమండ్రి జైలుకు తరలించారు. లిక్కర్ కేసులో ఏ-4 గా ఉన్న మిథున్ ను విచారించిన సెట్ నోటీసులు ఇచ్చి అరెస్ట్ చేసింది. ఈ రోజు వైద్య పరీక్షల తరువాత కోర్టులో ప్రవేశ పెట్టారు. మిథున్ ఆరోగ్య పరిస్థితుల గురించి ఆయన తరపు న్యాయవాదులు వివరించారు. వై కేటగిరీ భద్రత ఉన్న మిథున్ ప్రత్యేక బ్యారెక్ ఇవ్వాలని కోరారు. కాగా, మిథున్ రిమాండ్ రిపోర్టులో సెట్ కీలక అంశాలను ప్రస్తావించింది.

రిమాండ్ - ఆధారాలు లిక్కర్ కేసులో అరెస్ట్ అయిన మిథున్ రెడ్డికి ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ఆగస్టు1వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో మిథున్ ఏ-4గా ఉన్నారు. కాగా, మిథున్ ను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించాలని న్యాయస్థానం ఆదేశించింది.

కాసేపట్లో విజయవాడ నుంచి రాజమండ్రికి అధికారులు తరలించనున్నారు. ఇక, మిథున్ రిమాండ్ రిపోర్టు లో సెట్ పలు కీలక అంశాలను ప్రస్తావించినట్లు తెలుస్తోంది. రీజన్స్ ఫర్ అరెస్ట్ రిపోర్టు దాఖలు చేసిన సెట్.. మిథున్ కు ఈ కేసులో ప్రమేయం గురించి పూర్తి ఆధారాలు సమర్పించినట్లు సమా చారం. మనీ ట్రయల్‌తో పాటు కుట్రదారుడుగా మిథున్‌రెడ్డిని పేర్కొన్నారు.

లోతైన కుట్ర మద్యం విధానం మార్పు, అమలు, ఇతర నిందితులతో కలిపి డిస్టిలరీలు, సప్లయర్ల నుంచి నగదు తీసుకున్నట్లు నిర్ధారించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సత్యప్రసాద్‌కు ఐఏఎస్‌గా పదో న్నతి కల్పిస్తామని ఆశ చూపించి స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారని సిట్ అధికారులు వివరిం చారు. లిక్కర్ స్కాంలో లోతైన కుట్ర దాగి ఉందని వివరించారు. ఈ కుట్ర ఛేదించేందుకు భవి ష్యత్‌లోనూ దర్యాప్తు అవసరమని స్పష్టం చేశారు. ముడుపుల ద్వారా నిందితులు, ప్రైవేట్ వ్యక్తు లు, ఉన్నతాధికారులు రాజకీయ నేతలు, గత ప్రభుత్వంలో ఉన్నవారు లబ్ధి పొందారని చెప్పుకు చ్చారు. ఇప్పటివరకు అరెస్ట్ అయిన వారితో పాటు పరారీలో ఉన్నవారిని కూడా.. అదుపులోకి తీసు కుని విచారించాల్సి ఉందని రిపోర్టులో సిట్ అధికారులు పేర్కొన్నారు.

ఆదాయానికి గండి మిథున్ తన ప్రణాళికలను అమలు చేయానికి సత్యప్రసాద్‌ను ఉపయోగించారని తెలిపారు. బెవరేజెస్ కార్పొరేషన్ అధికారులతో సమావేశమై డిస్టిలరీల నుంచి ముడుపులు సేకరించి రాష్ట్ర ఆదాయానికి గండి కొట్టారని సిట్ అధికారులు వెల్లడించారు. మద్యం ముడుపులను 2024 ఎన్నికల్లో పోటీ చేసిన అప్పటి అధికార పార్టీ అభ్యర్థులకు పంపిణీ చేశారని పేర్కొన్నారు. నిందితులకు రాజకీయ పలుకుబడి ఉండటంతో.. సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని సిట్ అధికారులు తెలిపారు. మరింత దర్యాప్తు కోసం మిథున్‌రెడ్డికి రిమాండ్ విధించాలని కోరారు.

# ఆర్థ్రరైటిస్ నొప్పులతో సతమతం అవుతున్నారా..?
# అయితే ఈ చిట్కాలను పాటించండి..!



వయస్సు మీద పడిన వారికి సహజంగానే ఎముకల్లో పటుత్వం కోల్పోతారు. శరీరంలో క్యాల్షియం, విటమిన్ డి తగినంత స్థాయిలో ఉండవు. దీంతో ఎముకలు గుల్లబారిపోవడం, బలహీనంగా మారడం జరుగుతాయి. అయితే ప్రస్తుతం చాలా మందికి యుక్త వయస్సులోనే ఎముకల సంబంధిత సమస్యలు వస్తున్నాయి. వాటిల్లో ఆర్థ్రరైటిస్ కూడా ఒకటి. ఇది వచ్చేందుకు అనేక కారణాలు ఉంటా యి. ప్రమాదాల బారిన పడినప్పుడు గాయాలు అవడం, అధికంగా బరువు ఉండడం, వంశ పారంపర్యత, ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉండడం, జంక్ ఫుడ్‌ను ఎక్కువగా తినడం, శీతల పానీయాలు ఎక్కువగా సేవించడం, పోషకాహార లోపం వంటి పలు కారణాల వల్ల ఆర్థ్రరైటిస్ సమస్య వస్తుంది. దీంతో కీళ్లలో తీవ్రమైన నొప్పులు ఉంటాయి. అయితే ఆర్థ్రరైటిస్ సమస్యకు డాక్టర్లు ఇచ్చే మందులను వాడడంతోపాటు పలు ఇంటి చిట్కాలను కూడా పాటించవచ్చు. దీంతో నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. వాపులు సైతం తగ్గిపోతాయి. ఇక ఆ చిట్కాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం.

**వ్యాయామం..** ఆర్థ్రరైటిస్ సమస్య ఉన్నవారు తరచూ ఆయా భాగాలపై వేడి లేదా చల్లని ప్యాక్‌లను కాపడంలా పెడుతుండాలి. కనీసం 15 నుంచి 20 నిమిషాలు హీట్ లేదా ఐస్ ప్యాక్‌ను పెట్టకుంటూ ఉండాలి. దీంతో ఆయా భాగాల్లో రక్త సరఫరా మెరుగు పడుతుంది. నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

వాపు తగ్గిపోతుంది. ఆర్థ్రరైటిస్ ఉన్నవారు వ్యాయామం చేయాలంటే కష్టంగా ఉంటుంది. కానీ వీలైనంత వరకు కాళ్లు, చేతులను కదిలిస్తూ తేలికపాటి వ్యాయామాలు చేయాలి. వాకింగ్, స్విమ్మింగ్, సైకిల్ తొక్కడం, ఏరోబిక్ వ్యాయామాలు చేయవచ్చు. దీని వల్ల కండరాలు, కీళ్లలో కదలికలు సరిగ్గా ఉంటాయి. తరచూ చేస్తుంటే కీళ్ల నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. కీళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. కీళ్ల కదలిక సరిగ్గా ఉంటుంది. సమస్య మరింత తీవ్రతరం కాకుండా చూసుకోవచ్చు.

**ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు..** ఆర్థ్రరైటిస్ ఉన్నవారు అధికంగా బరువు ఉన్నట్లయితే ముందు బరువు తగ్గే ప్రయత్నం చేయాలి. కొందరికి అధిక బరువు కారణంగా కూడా ఆర్థ్రరైటిస్ నొప్పులు వస్తాయి. కనుక ముందు బరువు తగ్గించుకోవాలి. ఇలా చేస్తే చాలా వరకు ఆర్థ్రరైటిస్ నుంచి బయట పడవచ్చు. ఆర్థ్రరైటిస్ ఉన్నవారు యాంటీ ఇన్‌ఫ్లామేటరీ ఆహారాలను తరచూ తింటుండాలి. ఇవి నొప్పులను సహజసిద్ధంగా తగ్గించేందుకు పనిచేస్తాయి. ముఖ్యంగా సముద్రపు ఆహారం, చేపలు, రొయ్యలు వంటివి తినాలి. వీటిల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఆర్థ్రరైటిస్ నొప్పులకు ఔషధంలా పనిచేస్తాయి. అలాగే అవిసె గింజలు, చియా సీడ్స్, వాల్ నట్స్‌ను కూడా రోజూ తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఇవన్నీ నొప్పులను, వాపులను తగ్గిస్తాయి.

**యాంటీ ఇన్ ఫ్లామేటరీ ఆహారాలు..**

యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే బెర్రీలు, ఆకుపచ్చని కూరగాయలు, ఆకుకూరలు, బ్రోకలీ, ఆకుపచ్చ క్యాప్సికం తింటుండాలి. ఇవి నొప్పులను తగ్గిస్తాయి. వాపులు రాకుండా చూస్తాయి. ఓట్స్, బ్రౌన్ రైస్, కినోవా వంటి ఆహారాలను కూడా తినాలి. రాత్రి పూట పాలలో పసుపు కలిపి తాగుతున్నా కూడా ప్రయోజనం ఉంటుంది. పసుపులో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. అలాగే రోజూ భోజనానికి ముందు ఒక టీస్పూన్ అల్లం రసాన్ని ఉదయం పరగడుపునే సేవించాలి. అల్లంలో ఉండే సహజసిద్ధమైన పెయిన్ కిల్లర్ లక్షణాలు నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. రోజూ ఉదయం పరగడుపునే 2 పచ్చి వెల్లుల్లి రెబ్బలను తింటున్నా కూడా ఆర్థ్రరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. అదేవిధంగా శల్లకి, అశ్వగంధ వంటి మూలికలను ఆయుర్వేద వైద్యుల పర్యవేక్షణలో వాడాలి. గ్రీన్ టీ కూడా ఆర్థ్రరైటిస్ కు అద్భుతంగా పనిచేస్తుంది. ఇలా పలు సహజసిద్ధమైన చిట్కాలను పాటిస్తే ఆర్థ్రరైటిస్ నుంచి ఉపశమనం పొందవచ్చు.

## గోదావరిలో పులస - అకాశాన్ని అంటుతున్న ధర

కొనసాగనుంది. ఈ నేపథ్యంలో రికార్డు ధర పలుకుతుందేమో చూడాలి. గోదావరి నదికి వరదలు వచ్చే సమయంలో పులస సీజన్ ప్రారంభం అవుతుంది. ఈ ఏడాది గోదావరికి వరద నీటి తాకిడి పెరగడంతో పులస చేపల సీజన్ మొదలైంది. నదికి ఎర్ర నీరు ఉధృతంగా రావడంతో పులసలు ఎదురీదుతూ వస్తున్నాయి. ఈ క్రమంలోనే యానాంలో మత్స్యకారుల పంట పండుతోంది. నదీ ప్రవాహానికి అతి వేగంగా ఎదురీదడం పులస ప్రత్యేకత. అంతేకాదు.. ఎంతో రుచికరంగా కూడా ఉంటుంది. అందుకే పులస కోసం వేలంలో ఎంత ధర పెట్టడానికైనా జనాలు వెనుకాడరు. 'పుస్తెలు అమ్మైనా సరే.. పులస తినాలి' అనే నానుడి ఉన్న విషయం తెలిసిందే.

## భారత్ మరో కీలక ఘనత... మలేరియా నివారణకు స్వదేశీ వ్యాక్సిన్

విస్తృత రక్షణను అందిస్తుందని, రోగనిరోధక వ్యవస్థ నుంచి మలేరియా పరాన్నజీవి తప్పించుకునే అవకాశం తక్కువగా ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. దీర్ఘకాల రోగనిరోధక శక్తిని అందిస్తుందని, ఈ వ్యాక్సిన్ సాధారణ గది ఉష్ణోగ్రత వద్ద 9 నెలలకు పైగా స్థిరంగా ఉంటుందని పరీక్షలు సూచిస్తున్నాయి. ఈ వ్యాక్సిన్‌ను లాక్టోకాకస్ లాక్టిస్ బ్యాక్టీరియా ఉపయోగించి తయారు చేశారు, ఇది వ్యక్తులను రక్షించడమే కాకుండా మలేరియా వ్యాప్తిని కూడా తగ్గిస్తుంది. ఐసీఎంఆర్ ఈ వ్యాక్సిన్ టెక్నాలజీని పరిశ్రమలకు, తయారీదారులకు నాన్-ఎక్స్‌క్లూజివ్ ఒప్పందాల ద్వారా లైసెన్స్ చేయాలని యోచిస్తోంది. దీని ద్వారా విస్తృత ప్రజారోగ్య ప్రయోజనాలను సాధించడం లక్ష్యంగా ఉంది. 'మేక్ ఇన్ ఇండియా' ఉద్దేశాన్ని నెరవేర్చే ఈ స్వదేశీ వ్యాక్సిన్, మలేరియా నిర్మూలనలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యాక్సిన్ పరిశోధన, అభివృద్ధి దశలో ఉంది మరియు ఇంకా వాణిజ్య లేదా క్లినికల్ ఉపయోగం కోసం అందుబాటులో లేదు.

## రాజకీయ లబ్ధి కోసం విద్వేషాలు సృష్టించడం సులభం: కెటిఆర్

ఉన్నాయి. మేము ఎవరిపైనా తెలుగు భాషను రుద్దనప్పుడు.. కేంద్రం ఎందుకు హిందీని ఇతరులపై రుద్దే ప్రయత్నం చేస్తోంది" అని ప్రశ్నించారు. భారతదేశానికి జాతీయ భాష అవసరం లేదని, హిందీని తమపై రుద్దకూడదని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారిన హిందీ భాషా అంశంపై ఆయన మాట్లాడారు. జైపూర్‌లో జరిగిన టాక్ జర్నలిజం 2025లో భాగంగా జరిగిన చర్చలో భాష విషయంలో గట్టి వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో కేటీఆర్, విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థి జాతీయ భాష గురించి అడగగా... హిందీ జాతీయ భాష కాదని, భారతదేశంలో అనేక అధికారిక భాషలు ఉన్నాయని కేటీఆర్ అన్నారు. "ఏ భాష అయినా భావవ్యక్తీకరణకు ఓ సాధనం మాత్రమే. అది ఒక సాంస్కృతిక చిహ్నం. భారత్ లో 20 అధికారిక భాషలు, 300 అనధికార భాషలు ఉన్నాయి. హిందీ మాట్లాడేవారు ఎక్కువ ఉన్నారని హిందీ భాషను మా మీద రుద్దుతామంటే కుదరదు. తెలుగు భాషను జాతీయ భాషగా చేయాలని ప్రతిపాదిస్తే మిగతా ప్రాంతాల వారు ఒప్పుకుంటారా? 70-80 ఏళ్ళు దేశం బాగుంటే, మళ్లీ జాతీయ భాష ఎందుకు?" అని ప్రశ్నించారు. హిందీ భాషకు బడ్జెట్‌లో రూ. 50 కోట్లు కేటాయించి, తెలుగు, బెంగాలీ భాషలకు ఎందుకు నిధులు ఇవ్వలేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల ప్రజలపై తెలుగును రుద్దనప్పుడు హిందీని తమపై ఎందుకు రుద్దుతున్నారని ఆయన నిలదీశారు. దేశంలో అత్యధికంగా మాట్లాడే భాష హిందీ అయినప్పటికీ, హిందీ నేర్చుకోవాలా వద్దా అనేది ప్రజలకే వదిలేయాలని, దానిని వారిపై బలవంతంగా రుద్దకూడదని ఆయన అన్నారు.

## జగన్ లిక్కర్ మాఫియాతో కోటి కుటుంబాలు నాశనం- మాణికం ఠాగూర్

స్కామ్ కాదు. ఇది జగన్ శాస్త్రీయ అవినీతి ద్వారా బాగా ప్రణాళిక చేయబడిన, టాప్-డౌన్ ఆపరేషన్. నకిలీ సంస్థలు సృష్టించబడ్డాయి. దోపిడీని చట్టబద్ధం చేయడానికి పాలసీ తిరిగి వ్రాయబడింది. 2020-2024 మధ్య కనీసం రూ. 3,200 కోట్లు మళ్లించబడ్డాయని సిట్ నివేదికలు చెబుతున్నాయి. ఇందులో ఒక భాగం 2024 ఎన్నికల ప్రచారంలోకి పంపిణీ అయింది. నగదు, మద్యం ఉచిత వస్తువులుగా నియోజకవర్గాలలో పంపిణీ చేయబడ్డాయి. ఓటు కొనుగోలు, బూత్ నిర్వహణ కోసం ఉపయోగించబడింది" అని మాణికం ఠాగూర్ తన పోస్టులో వెల్లడించారు.

## ప్రియురాలితో సీక్రెట్‌గా పెళ్లి.. ఇప్పుడు మరో యువతితో ఎంగేజ్‌మెంట్!



**వెంగళరావునగర్, జూలై 20:** ప్రేమించిన యువతితో జరిగిన పెండ్లిని రహస్యంగా ఉంచి మరో యువతితో వివాహానికి సిద్ధమయ్యాడో ఓ వంచకుడు. ఆ విషయం తెలిసి నిలదీసేందుకు వెళ్తే.. బెదిరించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. హైదరాబాద్‌లోని మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అమీర్‌పేట ఎల్లారెడ్డిగూడలో నివాసించే ఓ యువతి(24) ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. రెండేళ్ల క్రితం జగిత్యాలకు చెందిన హరీశ్(25) ఆమెను ప్రేమిస్తున్నానని ప్రపోజ్ చేశాడు.

హరీశ్‌ను ప్రేమను సదరు యువతి కూడా అంగీకరించింది. కొంతకాలం తర్వాత సదరు యువతిని హరీశ్ అమీర్‌పేట దుర్గమ్మ గుడిలో వివాహం కూడా చేసుకున్నాడు. అయితే ఆ విషయాన్ని ఎవరికీ చెప్పకుండా రహస్యంగా ఉంచాడు. పెళ్లి తర్వాత ఇద్దరూ కలిసి కాపురం కూడా పెట్టారు. ఈ క్రమంలో సదరు యువతి గర్భం దాలిస్తే బలవంతంగా అబార్షన్ కూడా చేయించాడు. అయితే ఇటీవల తన అమ్మమ్మకు ఆరోగ్యం బాగోలేదని చెప్పి ఊరెళ్లిన హరీశ్.. అక్కడ మరో అమ్మాయితో నిశ్చితార్థం చేసుకున్నాడు. ఆ ఫొటోలను అతని స్నేహితుల ద్వారా అందుకున్న సదరు యువతి.. హరీశ్ ఊరికి వెళ్లి అతని కుటుంబసభ్యులను కలిసింది.

ఇప్పటికే తనను పెండ్లి చేసుకుని మరో అమ్మాయితో పెండ్లికి ఎలా సిద్ధమయ్యావని హరీశ్‌ను నిలదీసింది. కానీ అంతా ఒక్కటై సదరు యువతిని బెదిరించారు. హరీశ్‌తో సంబంధం లేదని రాయించి ఆమెతో బలవంతంగా సంతాకాలు చేసుకున్నారు. అలాగే గతంలో జరిగిన పెండ్లి విషయం బయటకు చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించి.. అక్కడి నుంచి పంపించేశారు. దీంతో జిన్నారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకున్న పోలీసులు కేసును మధురా నగర్ పీఎస్‌కు బదిలీ చేశారు.

## చినకాకానిలో ఉచిత మెగా వైద్య శిబిరం...





మంగళగిరి జూలై 20(లక్ష్యం న్యూస్)చినకాకాని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళగిరి శ్రీ సత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఏషియన్ వ్యాస్కులర్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సాధారణ వ్యాధులు, స్త్రీలకు సంబంధించిన వ్యాధులు, దంత పరీక్షలు, రక్తనాళాలకు సంబంధించిన వ్యాధులకు వైద్య పరీక్షల నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సాధారణ వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మీ సుసిరాణి, గైనకాలజిస్ట్ వైద్య నిపుణులు డాక్టర్ ఎం మాధవి లత, దంత వైద్య నిపుణులు డాక్టర్ జీవన, వ్యాస్కులర్ అండ్ ఎండో వ్యాస్కులర్ వైద్య నిపుణులు డాక్టర్ జీవీ ప్రమోద వైద్య సేవలు అందించారు. గ్రామ పరిసర ప్రాంతాల నుండి ప్రజలు హాజరై వైద్య సేవలు పొందారు. ఎన్నారై కార్డియాలజీ విభాగం మెడికల్ స్టూడెంట్స్, నిర్మల ఫార్మసీ కళాశాల ఫార్మసీ విద్యార్థులు రోగులకు సేవలందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు పూసపాటి సాయి కృష్ణ , శ్రీ సత్య సాయి భజన మండలి కన్వీనర్ డాక్టర్ రాయపాటి రామారావు, భజన మండలి ఆధ్యాత్మిక విభాగం ప్రతినిధి ఆర్టీసీ ప్రసాద్, మహిళా విభాగం ప్రతినిధులు రాధిక, లక్ష్మీ శ్యామల, హాస్పటల్ మార్కెటింగ్ మేనేజర్ వి నవీన్ పాల్గొన్నారు.

### ఉత్తమసేవలకు, ఆన్‌లైన్ సేవలు ప్రజల చేరువ చేసినందుకు

### జిల్లా స్థాయిలో అర్బన్ సీఐ పి రమేష్‌కు దక్కిన పురస్కారం

### జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు నుంచి

### పురస్కారం అందుకున్న సీఐ



చిలకలూరిపేట జూలై 20( లక్ష్యం న్యూస్ )ఉన్నతాధికారి నుంచి చిన్న పాటి ప్రసంశ. ఆవార్డు పనిచేసే అధికారులకు బాధ్యతను పెంచుతాయి. అధికారి లభించే పురస్కారం అధికారులు పనితీరుకు నిదర్శనంగా నిలుస్తాయి. ప్రజసేవలో నిబద్ధతతో పనిచేస్తే తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందనడానికి చిలకలూరిపేట అర్బన్ సీఐ పి రమేష్ నిదర్శనంగా నిలుస్తున్నారు. ఇప్పటికే పలు సందర్బాలలో ఉత్తమ పోలీసు అధికారిగా అవార్డులు పొందిన అర్బన్ సీఐ శనివారం మరోసారి అరుదైన ఘనతను స్వంతం చేసుకొన్నారు.

పారదర్శక సేవలకు దక్కిన పురస్కారం...

గత ఆరు నెలల నేర గణాంకాలపై సమగ్ర సమీక్ష, కేసుల దర్యాప్తు పురోగతి, ప్రజల ఫిర్యాదుల పరిష్కార అంశాలపై జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం చర్చ జరిగింది. గత ఆరు నెలల కాలంలో కేసుల దర్యాప్తు, సమాచార వ్యవస్థ బలోపేతం, అవగాహన కార్యక్రమాలు, బందోబస్తు విధుల నిర్వహణలో ఉత్తమంగా సేవలందించిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ చేతుల మీదుగా మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్బంగా పల్నాడు జిల్లా పరిధిలో క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ అండ్ సిస్టంస్ (%జజుచీూ%)లో చిలకలూరిపేట అర్బన్ సీఐ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ విధానాన్ని భారత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఒకే డేటాబేస్ ద్వారా నేరాలు, నేరస్థుల సమాచారం ట్రాక్ చేయడం. పోలీస్ స్టేషన్లను డిజిటలైజ్ చేయడం. ప్రజలకు అవసరమైన ఆన్‌లైన్ సేవలు (%ఖీ×=% స్టేటస్, వేరిఫికేషన్ లు మొదలైనవి) అందించడం జరుగుతుంది. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన కేసుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయడం, ఎఫ్ఐఆర్‌లు, ఛార్జ్‌షీట్లు, కేసు పురోగతిని అప్డేట్ చేయడం.పాస్‌పోర్ట్ వెరిఫికేషన్, నో అబ్జెక్షన్ సర్టిఫికేట్లు ( మొదలైన వాటిని ఆన్లైన్‌లో అప్డేట్ చేయడం వంటి పనుల్లో నిర్దేశించిన సమయంలోనే పూర్తి చేయడంతో అర్బన్ సీఐ పి రమేష్, కంప్యూటర్ ఆపరేటర్లు బాలస్వామి, సుబ్బారావు లు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. అధికారులు నిర్ధేశించిన సేవలను ఆన్‌లైన్ చేసి, పారదర్శకంగా సేవలను ప్రజలకు అందుబాటులో తేవడంలో అర్బన్ సీఐ సఫలీకృతులయ్యారు.

గతంలోనూ పలు పురస్కారాలు...

గతంలో జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లను ప్రాతిపదికగా తీసుకొని చేసిన ఎంపికలో రిసెప్షన్ నుంచి కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ వరకు బాధ్యతాయుతంగా పనిచేసిన విధానాన్ని పరిశీలించి ఎస్పీ ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ప్రకటించారు. దీంతో పాటు కేసుల పురోగతిలోనూ ముందంజలో ఉండటంతో అర్బన్ సీఐ పురస్కారాన్ని అందుకున్నారు. వ్యక్తిగత విభాగంలోనూ ఆయన పనితీరు, సామర్థం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని పి. రమేష్ బెస్ట్ సీఐ ఆవార్డు కూడా సొంతం చేసుకోసుకున్నారు. దీంతో పాటు జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్బంగా కూడా అర్బన్ సీఐ ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడం విశేషం. చేసే పనిపట్ల నిబద్ధత, ప్రజలకు సేవా చేయాలన్న సంకల్పం ఉన్న వారు ఎవరైనా ఉన్నత స్థానానికి చేరుకుంటారనటానికి అర్బన్ సీఐ నిదర్శనంగా నిలుస్తున్నారు. ఈ సందర్బంగా పలువురు పోలీసు సిబ్బంది, పట్టణ ప్రముఖులు ఈ సందర్బంగా అర్బన్ సీఐ పి రమేష్‌ను అభినందించారు. గుంతలు పూడ్చలేదని, ఆఖరికి వాగుల్లో పూడిక కూడా తీయలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, మండల పార్టీ అధ్యక్షులు కామినేని సాయిబాబు, కందిమళ్ల రఘురామారావు, మద్దినేని సుబ్బారావు, పోపురి వెంకయ్య, అల్లూరు ప్రసాద్, బాబు, మద్దినేడిశివరామకృష్ణ, పోపూరి వెంకట రత్తయ్య, కందుల రమణ, గంగా శ్రీనివాసరావు, గ్రామ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### మార్కెట్ యార్డ్ చైర్మన్ గా నియమితులైన కరిముల్లాను

### అభినందించిన స్నేహితులు బంధుమిత్రులు..

చిలకలూరిపేట జులై 20( లక్ష్యం న్యూస్ ):: మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా నియమితులైన షేక్ కరీముల్లాకు ఈరోజు ఆయన స్వగృహంలో బంధుమిత్రుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. గుర్రాల చావడీలోని ఆయన నివాసంలో స్నేహితులు, బంధుమిత్రులు కలిసి కరీముల్లాకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కరీముల్లా వియ్యంకుడు, షేక్ జహరుద్దీన్ భాష, అల్లుడు షేక్ తాజుద్దీన్ పాల్గొన్నారు. వారితో పాటు బంధుమిత్రులైన షేక్ షబ్బీర్, షేక్ గౌస్, షేక్ నభి, షేక్ కరీముల్లా (వేరొకరు), షేక్ హసన్, షేక్ రబ్బాని కూడా పాల్గొని నూతన చైర్మన్‌ను అభినందించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా కరీముల్లా నియామకం పట్ల వారంతా సంతోషం వ్యక్తం చేశారు.

# పోలీసులు సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో

# నిలిచిన మూడు నిండు ప్రాణాలు

### ఇద్దరు కుమార్తెలతో రైల్వే ట్రాక్ పై ఆత్మహత్యకు యత్నించిన మహిళ

### వేగంగా స్పందించి వారి ప్రాణాలను కాపాడిన వెదుళ్ళపల్లి ఎస్సై

### పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన మహిళ కుటుంబ సభ్యులు

### వెదుళ్ళపల్లి ఎస్సై వారి సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్



బాపట్ల జూలై 20 ( లక్ష్యం న్యూస్)ఒత్తిడికి లోనైనప్పుడు ఆత్మహత్య వంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవద్దని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ జిల్లా ప్రజలకు సూచించారు. వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని స్టూవర్టుపురం రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ పై ఒక మహిళ తన ఇద్దరి కుమార్తెలతో ఆదివారం ఉదయం ఆత్మహత్యకు ప్రయత్నించింది. సమయస్ఫూర్తిగా వ్యవహరించి వెదుళ్ళపల్లి ఎస్సై భాగ్యరాజ్ తన సిబ్బందితో కలిసి చాకచక్యంగా వారి ప్రాణాలను కాపాడారు.వివరాలలోకి వెళితే ఒక మహిళ ఇద్దరు పిల్లలతో కలిసి రైల్వే ట్రాక్ పై ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తుందని వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ కు కాల్ వచ్చింది. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాలు మేరకు వెదుళ్ళపల్లి ఎస్సై త్వరితగతిన స్పందించి వారి సిబ్బందిని వెంటపెట్టుకుని ఘటనా స్థలానికి చేరుకుని, స్టూవర్టుపురం రైల్వే స్టేషన్ పరిధిలోని రైల్వే ట్రాక్ పై ఆత్మహత్యకు యత్నించిన మహిళ, ఆమె కుమార్తెలను చాకచక్యంగా కాపాడినారు. వారు ఆత్మ హత్యకు యత్నించడానికి దారి తీసిన కారణాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ వివాదాల నేపథమే కారణమని తెలుసుకొని, వారి నివాసానికి వెళ్లి ఇరువురికి కుటుంబ విభేదాల పై కౌన్సిలింగ్ నిర్వహించి, కుటుంబ సమస్యలను పరస్పర చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించి, వారిని క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు.పోలీసులు వేగంగా స్పందించడం వల్లనే ముగ్గురు ప్రాణాలు నిలిచాయని, క్షేమంగా వారిని తీసుకువచ్చినందుకు వెదుళ్ళపల్లి పోలీసులకు, జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ లకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసులు స్పందించిన తీరు పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసినారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వ్యక్తిగతంగా కుటుంబ పరంగా ప్రతి ఒక్కరికి సమస్యలు ఉంటాయన్నారు. వాటిని సానుకూలంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి కృషి చేయాలన్నారు. అప్పటికి సమస్యలు పరిష్కారం కాకుంటే పోలీసులను ఆశ్రయించాలన్నారు. ఎలాంటి ఒత్తిడిలోనైనా ఆత్మహత్య వంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ఒక్కసారి మీ కుటుంబం, పిల్లల భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని ఆలోచించాలన్నారు. ప్రతి ఒక్క సమస్యకు తప్పనిసరిగా పరిష్కార మార్గం ఉంటుందన్నారు. తగిన సలహా, మార్గదర్శనం కోసం మీకు దగ్గరలోని పోలీస్ స్టేషన్ లేదా కుటుంబ కౌన్సెలింగ్ కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖ "శక్తి బృందాలను" ను ఏర్పాటు చేసిందని, మహిళలపై వేధింపులు, గృహ హింస, కుటుంబ విభేదాల వంటి సమస్యల పరిష్కారానికి మహిళా పోలీసులతో కూడిన ప్రత్యేక బృందం అందుబాటులో ఉందని, జిల్లా ప్రజలు వీరి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. 100/112 నెంబర్ల నుండి వచ్చే కాల్స్ పట్ల పోలీస్ అధికారులు వేగంగా స్పందించాలన్నారు. తద్వారా నేరాలను అరికట్టడంతో పాటు, ప్రజలను ప్రమాదాల బారి నుండి కాపాడడానికి ఆస్కారం ఉంటుందన్నారు. వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనే దానికి నిదర్శనమన్నారు. వెదుళ్ళపల్లి పోలీసులు ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు నిండు ప్రాణాలు కోల్పోయే వారని తెలిపారు. పోలీసులు ప్రతినిత్యం అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఉండాలన్నారు. అప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమన్నారు. వేగంగా స్పందించి ముగ్గురి నిండు ప్రాణాలను కాపాడిన వేదుళ్లపల్లి ఎస్సై భాగ్యరాజ్ ని వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# తుదిదశకు చేరిన జాతీయ రహదారి

### -త్వరలోనే ప్రజల అందుబాటులోకి జాతీయ రహదారి





మంగళగిరి జూలై 20(లక్ష్యం న్యూస్)మంగళగిరి:చెన్నై -కలకత్తా జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు... మరి ముఖ్యంగా గుంటూరు విజయవాడ నగరాల మధ్య రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోన్న జాతీయ రహదారి నిర్మాణ పనులు దాదాపూ తుది దశకు చేరుకున్నాయి. కృష్ణాజిల్లా గొల్లపూడి నుంచి గుంటూరు జిల్లా చినకాకాని వరకు దాదాపు 15 కిలోమీటర్ల మేర ఆరు వరుసలతో నూతన జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా కృష్ణా నదిపై 3.2 కిమీ మేర ఆరు వరుసల వంతెన నిర్మాణం ఇప్పటికే పూర్తైంది. మంగళగిరి నగరానికి పడమర వైపు జాతీయ రహదారి నిర్మాణం పూర్తి అయితే హైదరాబాద్ కు వెళ్లే వాహనదారులు విజయవాడ నగరానికి వెళ్లకుండానే జాతీయ రహదారి మీదుగా అతి తక్కువ సమయం లో హైదరాబాద్ కు చేరుకోవచ్చు. సాధ్యమైనంత త్వరలోనే జాతీయ రహదారి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణ పనులను వేగవంతంగా చేస్తున్నారు..

# సైలెన్సర్ల మోతతో అలజడి రేపుతున్న యువత.

### -బైక్ లకు సైలెన్సర్ల మార్పుతో దడ్...దడ...

### పోలీసుల హెచ్చరికలు సైతం బేఖాతర్




మంగళగిరి జూలై 20(లక్ష్యం న్యూస్)మంగళగిరి:నవ్య నగరం మంగళగిరి రోడ్లపై మితిమీరిన వేగంతో అధిక శబ్దంతో వెళుతున్న బైక్ లు నానాటికి పెరిగిపోతున్నాయి. కొందరు యువకులు ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లను మార్చి భారీ శబ్దాలు వచ్చే వాటిని అమర్చుకుంటున్నారు. వైల్డ్ బోర్, కాక్ టైల్ షార్మర్, డాల్ఫిన్, మెగా ఫోన్, టెయిల్ గన్నర్ వంటి రకరకాల పేరుతో వచ్చే సైలెన్సర్లు భారీ శబ్దాన్ని ఇస్తాయి. వీటి ధర ఒక్కొక్కటి రూ.5 వేల నుంచి రూ. 25వేల వరకు పలుకుతుంది. అనుసంధానంగా ఇతరత్రా పరికరాలను బిగించి నందుకు మెకానిక్ కు మరో రూ.3 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. వీటి ధర అధికమైనా కుర్రకారు ఏమాత్రం లెక్క చేయడం లేదు. తమకు నచ్చిన సైలెన్సర్లను బిగించుకుని రోడ్లపై రయ్ రయ్ మంటూ దూసుకుపోతున్నారు. వాస్తవానికి వీటి వాడకం చట్ట విరుద్ధం. పోలీసులకు పట్టుబడితే భారీ జరిమానాలతో పాటు జైలు శిక్ష పడుతుంది. కానీ సరికొత్త సైలెన్సర్ల నుంచి వచ్చే శబ్దానికి ఎక్కువ మంది యువత ఆకర్షితులవుతున్నారు. బైక్ లతో రోడ్డెక్కి తోటి వాహనదారుల గుండెల్లో అలజడి లేపుతున్నారు. కాగా ఇలాంటి సైలెన్సర్లు బిగించేందుకు అధిక మొత్తంలో డబ్బులు వస్తుండడంతో కొందరు మెకానికులు ఇలాంటి భయంకరమైన సౌండ్స్ వచ్చే సైలెన్సర్లు బిగిస్తున్నారు. పోలీసులు ఈ తరహా సైలెన్సర్లను అమరుస్తున్న మెకానికులను సైతం గుర్తించి వారిపై సైతం కేసులు నమోదు చేయాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

# సిమెంట్ రోడ్డు, కాలువలు, కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయండి!



చిలకలూరిపేట జులై 20( లక్ష్యం న్యూస్):: పట్టణంలోని 17వ వార్డుకు చెందిన రాచుమల్లు నగర్ వాసులు పలు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. గవర్నమెంట్ హాస్పిటల్ పడమర వైపున ఉన్న రోడ్డును అభివృద్ధి చేసి సిమెంట్ రోడ్డు, సైడ్ కాలువలు, కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానిక శాసనసభ్యులకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ వీలైనంత త్వరగా కాలనీవాసులు కోరిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో లోక్ సత్తా పార్టీ నాయకులు మాదాసు భాను ప్రసాద్, రాచుమల్లు నగర్ కాలనీవాసులు రమేష్, ప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలు.. పార్టీలకు అతీతంగా చంద్రబాబు సంక్షేమం అమలుచేస్తున్నారు : ప్రత్తిపాటి

- గతపాలకుల్లా వేధింపులు.. తప్పుడు కేసులు ఈ ప్రభుత్వంలో లేవు : ప్రత్తిపాటి
- అర్హత కలిగిన వైసీపీవారికి పథకాలు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మనది : ప్రత్తిపాటి.
- అభివృద్ధికి మారుపేరు చంద్రబాబు... ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని గ్రహించండి : ప్రత్తిపాటి
- అర్హులైన వారికి త్వరలోనే కొత్త పింఛన్లు మంజూరు చేస్తాం : ప్రత్తిపాటి
- సందెపూడి, జాలాది గ్రామాల్లో అభివృద్ధిపనులు ప్రారంభించి, ప్రజలతో మాట్లాడిన ప్రత్తిపాటి.
- వర్షంలోనూ ఇంటింటికీ వెళ్లి.. ప్రభుత్వ పథకాలు, పనితీరు గురించి ప్రజలతో మాట్లాడిన ప్రత్తిపాటి.











**చిలకలూరిపేట జూలై 20 (లక్ష్యం న్యూస్)::** ఆస్తులు, భూములు, ప్రాణాలు పోతాయన్న అభద్రతా భావం నుంచి... ప్రజలందరూ సంతోషంగా తమపనులు చేసుకుంటూ హాయిగా జీవిస్తున్నారని, అందుకు కారణం ముఖ్యమంత్రి సమర్థ నాయకత్వమేనని, గత పాలకుల్లా ప్రజల్ని ఇబ్బందిపెట్టే విధానాలు, కక్ష సాధింపులు కూటమిప్రభుత్వంలో ఉండవని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు : ఇంటింటికీ తెలుగుదేశంలో భాగంగా యడ్లపాడు మండలం సందెపూడి, జాలాది గ్రామాల్లో ప్రత్తిపాటి పర్యటించారు. జోరున వర్షం కురుస్తున్నా ఇళ్లకు వెళ్లి, ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. జాలాదిలో రూ.40లక్షల వ్యయంతో వేసిన మెటల్ రోడ్లు, సందెపూడిలో రూ.13లక్షలతో వేసిన సీసీ రోడ్లు ప్రారంభించిన ప్రత్తిపాటి... ప్రజలనుద్దేశించి మాట్లాడారు.

**ఒక్క పింఛన్లకే చంద్రబాబు ఐదేళ్లలో రూ.1.75లక్షలకోట్లు వెచ్చిస్తున్నారు..**

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపై నిలవాలని, సందెపూడి తొలినుంచీ ఏకపక్షంగా టీడీపీకి పనిచేస్తోందని, గ్రామస్తులు చెప్పిన సమస్యల్ని తప్పక పరిష్కరిస్తానని, అభివృద్ధిపనుల్ని కూడా పూర్తిచేస్తానని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. అర్హులైన వారికి పింఛన్లు తప్పక అందిస్తామన్నారు. తల్లికి వందనంతో పాటు, ప్రతి బీద కుటుంబానికి దీపం-2 కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారని, త్వరలోనే ఉచిత బస్ ప్రయాణంకూడా మహిళలకు అందుబాటులోకి రానుందన్నారు. చంద్రబాబు ఎప్పుడూ మహిళల సంతోషానికే ప్రాధాన్యత ఇస్తారని ప్రత్తిపాటి చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వం ఏటా పింఛన్లకే రూ.34వేలకోట్లు చెల్లిస్తోందన్నారు. ఐదేళ్లలో కేవలం పింఛన్లకే రూ.1.75లక్షలకోట్లు వెచ్చిస్తోందన్నారు. మహాశక్తి పథకాన్ని పీ-4కు అనుసంధానించే ఆలోచనలో ప్రభుత్వముందన్నారు. నిరుద్యోగ భృతి కూడా త్వరలోనే అమల్లోకి వస్తుందన్నారు. ఇంటి స్థలం లేని అర్హులకు గ్రామాల్లో 3 సెంట్లు ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందన్నారు.

**రీసర్వే సమస్యలే జగన్ కు శాపంగా మారాయి.. కూటమి ప్రభుత్వం సంవత్సరంలో సమస్య పరిష్కరిస్తుంది..**

రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యల్ని ప్రభుత్వం త్వరలోనే పరిష్కరిస్తుందన్నారు. జగన్ ప్రభుత్వం చేసిన తప్పుల తడక సర్వేవల్ల ప్రతి రైతూ ఇబ్బందులు పడుతున్నాడని, గందరగోళంగా నిర్వహించిన భూముల రీసర్వేసమస్యలు ఇప్పటికీ రాష్ట్ర రైతాంగాన్ని పట్టిపీడిస్తున్నాయని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేయకుంటే ఇంకా అవస్థలు పడేవారన్నారు. రాళ్లు మార్చడం..గట్లు తొలగించడం.. పాస్ పుస్తకాల్లో తప్పుల వంటి సమస్యలన్నీ సరిదిద్దడానికి సమయం పడుతుందన్నారు. రీసర్వేలో చేసిన తప్పులే జగన్ కు శాపంగా మారాయన్న ప్రత్తిపాటి.... మరో సంవత్సరంలో భూముల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఇప్పటికే చెప్పారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రత్తిపాటి భరోసా ఇచ్చారు.

**ముఖ్యమంత్రి పార్టీలకు అతీతంగా అర్హులైన వైసీపీవారికి పథకాలు అందిస్తున్నారు..**

జగన్ అమ్మఒడి పేరుతో తల్లుల్ని మోసగించాడని, బటన్ నొక్కుడు ముసుగులో అన్నివర్గాలను దగాచేశాడని ప్రత్తిపాటి చెప్పారు. చంద్రబాబు నాయకత్వాన్ని ప్రజలు ఆదరించాలని, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అనుభవజ్ఞుడైన చంద్రబాబుకు ఎందుకు మద్ధతిస్తున్నారో ఆలోచించాలని ప్రత్తిపాటి సూచించారు. 76 ఏళ్లవయసులో చంద్రబాబు పడుతున్న కష్టం మనకోసమేనని అందరూ గ్రహించాలన్నారు. వైసీపీకి మద్ధతివ్వని ప్రతి కుటుంబాన్ని గతపాలకులు వేధించారని, ఆఖరికి ప్రజల ఆస్తులు..భూములు కూడా కాజేశారని ప్రత్తిపాటి తెలిపారు. టీడీపీ నాయకత్వం.. ముఖ్యమంత్రి ఎవరినీ ఇబ్బంది పెట్టడం లేదని, తప్పుడుకేసులతో వేధింపులకు పాల్పడటం లేదని, పార్టీలకు అతీతంగా వైసీపీవారికి కూడా పథకాలు అందిస్తున్నారన్నారు. ఏడాదిలో ప్రభుత్వం నుంచి నియోజకవర్గానికి రూ.1000కోట్ల అభివృద్ధి %-% సంక్షేమం ఫలాలు అందాయన్న ప్రత్తిపాటి, అభివృద్ధికి మారుపేరు చంద్రబాబనే నిజాన్ని అందరూ గ్రహించాలన్నారు. గతపాలకులు రోడ్లపై గుంతలు పూడ్చలేదని, ఆఖరికి వాగుల్లో పూడిక కూడా తీయలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, మండల పార్టీ అధ్యక్షులు కామినేని సాయిబాబు, కందిమళ్ల రఘురామారావు, మద్దినేని సుబ్బారావు, పోపురి వెంకయ్య, అల్లూరు ప్రసాద్, బాబు, మద్దినేడిశివరామకృష్ణ, పోపూరి వెంకట రత్తయ్య, కందుల రమణ, గంగా శ్రీనివాసరావు, గ్రామ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఎనిమిదో రోజుకు చేరిన మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

**రాజధాని లోని ఎర్రబాలెంలో మున్సిపల్ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపిన వైయస్సార్ సిపి నేతలు**

**సమ్మె శిబిరం వద్ద వంట,వార్పు చేసి వినూత్నంగా మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి**

**సమస్య పరిష్కారానికి మున్సిపల్ యంత్రాంగం, మంత్రి చొరవ చూపాలి**

**మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల కు జీవో నెంబర్ 36 ను అమలు చేసి జీతాలు పెంచాలి**

**జీవో నెంబర్ 26 ప్రకారం మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలి**




మంగళగిరి జూలై 20(లక్ష్యం న్యూస్) మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె నేటికీ ఎనిమిదో రోజుకు చేరినప్పటికీ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదని రవి అన్నారు మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను మాత్రమే అమలు జరపమని కార్మికులు కోరుతున్నారని ఇచ్చిన హామీలు అమలు జరపకుండా మాట తప్పడం సమ్మె కొనసాగుతున్నప్పటికీ పరిష్కారానికి మున్సిపల్ మంత్రి ,యంత్రాంగం చొరవ చూపించకపోవడం ఏమాత్రం సరైనది కాదని అన్నారు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెత్త పేరుకుపోయి ప్రజలు అనారోగ్యాల పాలు కాకముందే ప్రభుత్వం మేలుకోవాలని, మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారుమున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని, మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం పెంచబోతున్న పని గంటలను ఉపసంహరించుకోవాలని రవి డిమాండ్ చేశారు వైయస్సార్ సిపి నాయకులు డాక్టర్ మేరీగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల చేస్తున్న సమ్మెకు వైసిపి పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని అన్నారుమున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా వారి జీతాలు వెంటనే పెంచాలని కోరారు మున్సిపల్ కార్మికులకు సంఘీభావం తెలిపిన వారిలో ఎర్రబాలెం వైయస్సార్ సిపి అధ్యక్షులు లేళ్ల శివ వైఎస్ఆర్పి నాయకులు షేక్ బడే మియా దానబోయిన నాగయ్య ఆకుల శంకర్ షేక్ షఫీ దాసరి ప్రియా నందం షేక్ గౌస్ తదితరులు ఉన్నారు

సమ్మెలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు టి బాబు రామారావు టి ఆదిలక్ష్మి కే కోటేశ్వరి ఎం పార్వతి ఎన్ దివ్య రమాదేవి ఎస్కే కరిముల్లా చనుమోలు కోటేశ్వరరావు చిన్న శీను ఏడుకొండలు అంకమ్మ తదితరులు పాల్గొన్నారు

# వైసీపీ నాయకులకు సవాల్ విసిరిన గంగా శ్రీనివాసరావు.. లెనిన్ బాబు

**ప్రత్తిపాటి పుల్లారావు చేసిన అభివృద్ధిని గురించి బహిరంగ చర్చకు మేము సిద్ధమే ,మీరు సిద్ధమా:**

**మున్సిపల్ కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు**

చిలకలూరిపేట జులై 20 (లక్ష్యం న్యూస్): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ప్రత్తిపాటి గెస్ట్ హౌస్‌లో ఆదివారం విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. నిన్న మాట్లాడిన వారి ఇళ్లల్లో ఎంతమందికి వారి తల్లిదండ్రులకు పెన్షన్లు రావట్లేదని, ఎంతమంది పిల్లలకు 'తల్లికి వందనం' పథకం అందట్లేదని ప్రశ్నించారు. ఈ విషయాలపై ఒకసారి చెక్ చేసుకొని మాట్లాడాలని ఆయన హితవు పలికారు.అభివృద్ధిలో పోటీ కాదని అధికార పార్టీ నాయకులు చెబుతున్నారని, అయితే రైతులు పండించిన పొగాకు, నిత్యావసర వస్తువుల ధరలు అంతర్జాతీయ మార్కెట్‌కు సంబంధించినవని, వాటికి రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సంబంధం లేకపోయినప్పటికీ ముఖ్యమంత్రి కొన్ని సబ్సిడీలు ఇచ్చి పొగాకు, మిర్చి, శెనగలు, కందులు వంటి నిత్యావసర వస్తువులు, వాణిజ్య పంటలను ప్రభుత్వమే సొంత నిధులతో కొనుగోలు చేస్తుందని తెలిపారు. నిన్న మాట్లాడిన వారు కూడా ఈ విషయాలు తెలుసుకొని మాట్లాడాలని, తమ పండించిన పంటలను అమ్ముకుంటున్నారా లేదా అని ఆత్మవిమర్శ చేసుకోవాలని కోరారు.అభివృద్ధి గురించి వైసీపీ నాయకులకు తెలియదేమో అని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్ల కాలంలో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చేసిన అభివృద్ధిని నిన్న, ఇవాళ, రేపు ఎప్పుడైనా చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని, బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఏదో సామెతలు చెబుతూ సంక్షేమ పథకాలు ఇవ్వట్లేదని, అభివృద్ధి కార్యక్రమాలు చేయడం లేదని విమర్శించడం తగదని అన్నారు.నిన్న మాట్లాడిన వారి ఇళ్లల్లో కూడా పెన్షన్లు వస్తున్నాయని, తల్లికి వందనం పథకం వర్తిస్తుందని చెప్పారు. రేపటి ఆగస్టు 15వ తారీఖు నుంచి ఫ్రీ బస్సు, అలాగే రైతులకు రైతు భరోసా డబ్బులు కూడా వచ్చే నెలలో వేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని వైసీపీ నాయకులు అంటున్నారని, అయితే వారికి కళ్లున్నాయా లేవా అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు రాగానే ఒకటో తారీఖునే 3,000 పెన్షన్‌ను 4,000 చేశారని, ఆ తర్వాత 4,000, 6,000, 10,000, 15,000 చేశారని తెలిపారు. ఇవి కళ్లకు కనబడుతున్నాయా, కనబడట్లేదా అని అడిగారు. ఈ విషయాలపై కూడా ఆత్మవిమర్శ చేసుకోవాలని, పేపర్లు, టీవీలు చూసి మాట్లాడాలని శ్రీనివాసరావు కోరారు.వైసీపీనాయకులు, ముఖ్యంగా విడుదల రజిని కి ప్రతిపాటి పుల్లారావును విమర్శించే అర్హత లేదు: టిడిపి ఎస్సీ సెల్ నాయకులు లెనిన్ బాబు.. తెలుగుదేశం పార్టీకి ఎస్సీ సెల్ నాయకులు లెనిన్ బాబు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు, ముఖ్యంగా విడుదల రజనీకి ప్రతిపాటి పుల్లారావును విమర్శించే అర్హత లేదని ఆయన స్పష్టం చేశారు. ఒక కార్యకర్తగా కూడా విడుదల రజని చిలకలూరిపేటలో తెలుగుదేశం పార్టీలో పనిచేయలేదని, ఎటువంటి అర్హత లేని రజిని మామ విడుదల లక్ష్మీనారాయణకు ప్రతిపాటి పుల్లారావు రాజకీయ భిక్ష వలన, మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా చేసి అభివృద్ధి చేస్తే, వెన్నుపోటు పొడిచారని లెనిన్ బాబు ఆరోపించారు.గత ఐదు సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు తమ దళిత వార్డుల్లో ఆమె ఎందుకు తిరగలేదని, తమ వార్డుల్లో తిరగడానికి ఆమెకు భయమేసిందని ఆయన ప్రశ్నించారు. వైఎస్సార్సీపీ నాయకులు 12వ వార్డులో గానీ, మిగతా వార్డుల్లో గానీ ఎలాంటి పనులు చేయలేదని, నాయకులు పట్టించుకోలేదని, కాలువలు గానీ, రోడ్లు గానీ వేయలేదని ఆయన విమర్శించారు. ప్రతిపాటి పుల్లారావు వచ్చిన తర్వాత నుంచి చిలకలూరిపేటలో రోడ్లు, కాలువలు, సంక్షేమ పథకాలు, ప్రజల సమస్యలు అన్నింటికీ అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తున్నారని లెనిన్ బాబు పేర్కొన్నారు. విడుదల రజని ఏ రోజైనా వార్డుల్లోకి వచ్చి ప్రజల సమస్యలను తీర్చారా అని ఆయన సవాల్ విసిరారు. ఈ సమావేశంలో నెల్లూరు సదాశివరావు, కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, కందుల రమణ, తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డ్ చైర్మన్ గా నియమితులైన కరిముల్లాను అభినందించిన స్నేహితులు బంధుమిత్రులు..



చిలకలూరిపేట జులై 20( లక్ష్యం న్యూస్ ):: మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా నియమితులైన షేక్ కరీముల్లాకు ఈరోజు ఆయన స్వగృహంలో బంధుమిత్రుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. గుర్రాల చావడీలోని ఆయన నివాసంలో స్నేహితులు, బంధుమిత్రులు కలిసి కరీముల్లాకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కరీముల్లా వియ్యంకుడు, షేక్ జహరుద్దీన్ భాష, అల్లుడు షేక్ తాజుద్దీన్ పాల్గొన్నారు. వారితో పాటు బంధుమిత్రులైన షేక్ షబ్బీర్, షేక్ గౌస్, షేక్ నభి, షేక్ కరీముల్లా (వేరొకరు), షేక్ హసన్, షేక్ రబ్బాని కూడా పాల్గొని నూతన చైర్మన్‌ను అభినందించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా కరీముల్లా నియామకం పట్ల వారంతా సంతోషం వ్యక్తం చేశారు.

# బాపట్లలో ఆషాడమాసం అంబరాన్ని తాకిన ప్రసన్న దుర్గ భవానీ మాత ఉత్సవాలు



**బాపట్ల జూలై 20 ( లక్ష్యం న్యూస్)**ఆషాడమాసం చివరి ఆదివారం సందర్భంగా బాపట్ల పట్టణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. 13వ వార్డు ఎస్.ఎన్.పి. అగ్రహారంలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్న దుర్గ భవానీ మాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఆషాడమాసం సరే సమర్పించుకున్నారు.మహిళలందరూ అమ్మవారి ప్రతిమను నెత్తిన మోస్తూ, బాపట్ల పట్టణానికి అధిష్టాన దేవత అయిన గ్రామదేవత పోలేరమ్మ తల్లిని దర్శించుకున్నారు. అక్కడ పోలేరమ్మ తల్లికి చీర, గాజులు, పసుపు కుంకాలతో పాటు పొంగలి, పులిహోర, చలిమిడి వంటి అనేక రకాల నైవేద్యాలను పోలేరమ్మ తల్లికి సారెను సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. పోలేరమ్మ తల్లి దర్శనం అనంతరం, తిరిగి వచ్చే దారిలో ఉన్న ఇతర దేవాలయాలను కూడా దర్శించుకొని చివరగా శ్రీ ప్రసన్న దుర్గ భవానీ మాత ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు శాకాంబరీ దేవి అవతారంలో రకరకాల కూరగాయలతో అలంకరించబడి భక్తులకు కనుల పండుగ చేశారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తన్మయత్వం చెందారు. అనంతరం అమ్మవారికి భజనలు చేసి, అన్నదాన కార్యక్రమంలో భక్తులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు బాపట్లలో ఆధ్యాత్మిక శోభను రెట్టింపు చేశాయి.

# శేషగిరిరావు మరణం పార్టీకి తీరని లోటు : ప్రత్తిపాటి

**పిన్నెల్లి సోదరుల ఫ్యాక్షన్ రాజకీయాలను ధైర్యంగా ఎదుర్కొన్న ధీశాలి శేషగిరిరావు : ప్రత్తిపాటి.**



చిలకలూరిపేట జూలై 20 (లక్ష్యం న్యూస్):: టీడీపీ సీనియర్ నాయకుడు, నంబూరి శేషగిరిరావు మరణవార్త ఆవేదనకు గురిచేసింది. తెలుగుదేశం పార్టీ నిబద్ధత కలిగిన నిజాయతీపరుడైన ఒక మంచి నాయకుడిని కోల్పోయింది. ఆయన మరణం నిజంగా పార్టీకి తీరనిలోటు. శేషగిరిరావు తొలినుంచీ ధైర్యసాహసాలతో పార్టీకోసం పనిచేశారు. గత ప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ అప్పటి వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొన్నారు. పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఈ.వీ.ఎమ్ లు పగులగొట్టి వీరంగం వేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ప్రశ్నించి, టీడీపీ కేడర్లో కొత్త ఉత్సాహం నింపిన నాయకుడు. మాచర్ల నియోజకవర్గంలో పిన్నెల్లి సోదరులు సాగించిన ఫ్యాక్షన్ రాజకీయాలను ధైర్యంగా ఎదిరించిన ధీశాలి శేషగిరిరావు. అటువంటి నాయకుడు అకాలమరణం చెందడం నిజంగా బాధాకరం. ఆయన ఆత్మకు శాంతికలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. శేషగిరిరావు కుటుంబసభ్యులకు నా ప్రగాడ సానుభూతి తెలియచేస్తున్నాను." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో తెలిపారు.

# రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు కాపు వెంకటరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం...

చిలకలూరిపేట జులై 20 (లక్ష్యం న్యూస్)::పట్టణంలోని శ్రీ శారదా జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం మొక్కలు నాటారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు కాపు వెంకట్రావు ఆధ్వర్యంలో వారి కుమారుడు ఎన్నారై కాపు రామకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా ఈ సేవ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ తో పాటు పిల్లలకు నీడనివ్వడం, పండ్లను ఇవ్వడం కోసం మామిడి, కొబ్బరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు తోటకూర వెంకట నారాయణ, సాంబయ్య, గల్లా సాంబశివరావు, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, విద్యార్థులు తదితరులు వున్నారు. అలాగే కోటప్పకొండలో వున్న ధనమ్మ అన్నదాన సత్రంలో నిత్యావసర సరుకులు, దుప్పట్లు, మెడిసిన్స్ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా వివేకానంద సేవాసమితి అధ్యక్షులు వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ కాపు వెంకట్రావు సమాజానికి చేస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాపు వెంకట్రావు, తోటకూర వెంకటనారాయణ, మేదూరి వాసుదేవరావు, తదితరులున్నారు.

## ముస్లిం స్మశాన వాటిక పరిరక్షణా చర్యలు తీసుకోవాలి

**- వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ లకు వినతి**





**మంగళగిరి :** నగరంలోని ముస్లిం స్మశాన వాటిక (ఖబర్ స్థాన్) పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వివిధ జమాత్ లకు చెందిన ముస్లిం ప్రతినిధులు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ జనాబ్ షేక్ అబ్దుల్ అజీజ్, డైరెక్టర్ షేక్ అక్రమ్, గుంటూరు నగర తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ లకు ఆదివారం వినతి పత్రాలను అందజేశారు. మంగళగిరి నగరంలో రెండు వందల సంవత్సరాలుగా ఉన్న ముస్లిం స్మశాన వాటిక ను రహదారి విస్తరణ పేరుతో కొంత భాగాన్ని తొలగించాలన్న మున్సిపాలిటీ ప్రతిపాదనపై తాము తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ముస్లింల జనాభా మూడువేల మంది ఉన్నప్పటి నుండి యాభైవేలకు పైగా పెరిగినా ఈ స్మశానవాటికనే మృతుల అంత్యక్రియల కోసంఉపయోగిస్తున్నామని తెలిపారు. ఈ ఖబర్ స్థాన్ వక్ఫ్ బోర్డు నోటిఫై చేసిన స్థలం కావడంతో దీని పరిరక్షణ కూడా వక్ఫ్ బోర్డు బాధ్యతగా తీసుకోవాలని వారు కోరారు. వాస్తవానికి నగరపాలక సంస్థ అధికారులు ప్రతిపాదించిన తెనాలి రోడ్డు అనేక మలుపులు ఉండటంతో ఇది విస్తరణకు ఎంతమాత్రం అనుకూలం కాదని, అందులో పలు మతపరమైన ప్రదేశాలు ఖబరస్తాన్, దేవాలయాలు, చర్చి ఉండటం వల్ల అన్ని మతాలకు చెందిన వారి మనోభావాలు, విశ్వాసాలు దెబ్బతినే అవకాశం ఉందని ముస్లిం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తెనాలి రోడ్డును వన్ వే గా చేసి, జాతీయ రహదారిని నేరుగా కలిపే ప్రత్యామ్నాయ మార్గాలను అభివృద్ధి చేయడం ద్వారా ట్రాఫిక్ ను సమర్థంగా నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## గ్రానైట్ అక్రమ రవాణాతో ప్రభుత్వం రూ.కోట్ల ఆదాయం కోల్పోతుంది.

**- కూటమి నాయకుల దోపిడి ని అరికట్టాలి.**

**- వైసిపి నేత డాక్టర్ అశోక్ కుమార్.**



**దాచేపల్లి, జూలై 20, లక్ష్యం ప్రతినిధి :** ప్రకాశం జిల్లా మార్టూరు, చీమకుర్తి నుండి పల్నాడు మీదుగా రోజు 70 నుంచి 80 గ్రానైట్ లారీలు పక్క రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్నారని దీంతో ప్రభుత్వం రూ.కోట్ల రూపాయల ఆదాయం కోల్పోతుందని వైయస్సార్ కాంగ్రెసు పార్టీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి శ్రీనివాసరావు ఆరోపించారు.ఈ మేరకు గ్రానైట్ అక్రమ వ్యాపారం పై ఆయన స్పందించారు. ఆదివారం మీడియా తో మాట్లాడుతూ కూటమి నాయకుల దోపిడి ని ఆయన ఎండగట్టారు. ఒక్కో గ్రానైట్ లారీకి 1,70,000 రూపాయల చొప్పున ఒక రోజుకి ప్రభుత్వానికి కోటి 60 లక్షల రూపాయల పన్ను చెల్లించాల్సి ఉంటుంది కానీ ఎటువంటి జీఎస్టి ,రాయల్టీ లేకుండా అక్రమంగా గ్రానైట్ లారీలను తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ సొమ్మంతా మీ ఎమ్మెల్యేల జేబుల్లోకి వెళుతుందా లేక మీ నాయకులు జేబుల్లోకి వెళ్తున్నాయా అని ప్రశ్నించారు.సంపద సృష్టిస్తామన్న చంద్రబాబు, రాష్ట్ర సంపద తమ నాయకుల జేబుల్లోకి వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగము అధికారులు స్పందించి గ్రానైట్ మాఫియాని కట్టడి చేయకపోతే ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతాము అని డాక్టర్ అశోక్ కుమార్ హెచ్చరించారు.

## మహంకాళి అమ్మవారికి బోనాలు

**- వేడుకలో పాల్గొన్న తిరుమల శెట్టి**



**మంగళగిరి జూలై 20(లక్ష్యం న్యూస్) :** మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని దుగ్గిరాల మండలం కంటంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారికి బోనాలు కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. రంగిశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకులు రంగిశెట్టి జగదీష్ బాబు ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపు కుంకుమలు సారే, బోనాలను సమర్పించారు.

మేళ తాళాలు కనకతప్పెట్లు, విచిత్ర వేషధారణలతో అమ్మవారి ఆలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన మంగళగిరి నియోజకవర్గం సీనియర్ నాయకులు, జై కాపు సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమల శెట్టి కొండలరావు, రంగశెట్టి ఫౌండేషన్ సభ్యులు రంగిశెట్టి రమేష్, చెన్నం శెట్టి నాగరాజు, దోనె సాంబశివరావు, పలువురు జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విశాఖపట్నంలో పారా క్రీడాకారులకు ఘన సన్మానం



**దుర్గి జూలై 20(లక్ష్యం న్యూస్) :** విశాఖపట్నంలో NTR ట్రస్ట్ ఆధ్వర్యంలో తలసేమియా బాధితులకోసం నిర్వహించిన తలసేమియా రన్ వైజాగ్‌లో SAAP చైర్మన్ రవి నాయుడు చొరవతో సాధారణ క్రీడాకారులతో సమానంగా పారా క్రీడాకారులను గుర్తించి NTR ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అంతర్జాతీయ పారా క్రీడాకారులు శ్యామ్(గుంటూరు) ఘనంగా సన్మానించారు. పారా క్రీడాకారులను గుర్తించి వారికి సన్మానించిన NTR ట్రస్ట్ వారికి, నారా భువనేశ్వరికి సాధారణ క్రీడాకారులతో పాటు పారా క్రీడాకారులకు కూడా సమానంగా అవకాశం కల్పించిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (SAAP) చైర్మన్ రవి నాయుడు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసిన పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు శ్రీ గోనుగుంట్ల కోటేశ్వరరావు , మరియు శ్యామ్ కి ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు కందుకూరి రమేష్ మాదిగ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. శ్యామ్ భవిష్యత్తులో ఇంకా ఉన్నతమైన స్థానంలో ఉండాలని ఆయన అన్నారు.

# ఎంపీ మిదున్ రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగాకండిస్తున్నాం

**వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు : కె.కె రాజు**



**విశాఖపట్నం లక్ష్యం ప్రతినిధి జులై 20:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు,అరాచకాలు రోజు రోజుకి పెరుగుపోతు ఉన్నాయి. ముఖ్యంగా గౌరవ వై.యస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేక.. కూటమి ప్రభుత్వం164 స్థానాల్లో గెలిచినాసరే ఎన్నికలై సంవత్సరం కాలం పూర్తి కాకముందే జగన్మోహన్ రెడ్డి గారు రాష్ట్రంలో ఎక్కడికి పర్యటనకు వెళ్లినా వేలాదిగా ప్రజలు తరలివస్తున్నారు.. వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు యాక్టీవ్ గా ఉంటే ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుంది ప్రజలు తిరగబడతారనే ఉద్దేశంతో ఈరోజు లేని లిక్కర్ స్కామ్ ను తీసుకువచ్చి ఎక్కడా ఎలాంటి ఆధారాలు లేకుండా గత కొన్ని నెలలుగా కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న కొన్ని పత్రికల్లో కొన్ని టీవీ ఛానల్లో తప్పుడు కథనాలతో ప్రచారాలు చేసి ఆకథనాలు నిజం చేస్తూ ఒక్కొక్కరిని అరెస్టులు చేస్తున్నారు.. అందులో భాగంగా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ నాయకులు,రాజంపేట ఎంపీ మిదున్ రెడ్డి అన్యాయంగా,అక్రమంగా అరెస్టు చేశారు.ఈ అరెస్టు మేము తీవ్రంగా కండిస్తున్నాము. ఇది నూటికి నూరుశాతం అక్రమ అరెస్టు.. వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీనాయకులను,కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేద్దామనే ఉద్దేశంతో మీరు ఇదేవిదంగా అక్రమ అరెస్టులు కొనసాగిస్తే రాష్ట్ర ప్రజలువైస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు చూస్తూ ఊరుకోరు.. కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు. వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఎవరైతే అరెస్టులకు గురుఅయ్యారో వారందరి మేము అండగా నిలబడతాము వారి అక్రమ అరెస్టులకు నిరసనగా మేము ఏపోరాటానికైన సిద్ధం..

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపైనా, పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై ప్రత్యేక డ్రైవ్

**- విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్.. - జిల్లా వ్యాప్తంగా ఓపెన్ డ్రింకింగుపై ప్రత్యేక డ్రైవ్స్ చేపట్టిన పోలీసు అధికారులు**

**- ఒక్క రోజునే జిల్లా వ్యాప్తంగా 255 ఓడి కేసులు, 53 సి.ఓ.టీ.పి.ఎ కేసులు నమోదు చేసామన్న జిల్లా ఎస్పీ**

**- పట్టుబడిన మందుబాబులకు జిల్లా ఎస్పీ ఆదేశాలతో కౌన్సిలింగు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు**



**విజయనగరం లక్ష్యం ప్రతినిధి సతీష్ జూలై 20 :** విజయనగరం జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగించినా, విద్యాసంస్థలకు 100మీటర్ల పరిధిలో సిగరెట్స్, ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ గారు జూలై 20న హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మందుబాబులపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టేందుకుగాను, విద్యాసంస్థలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులు విక్రయించిన వ్యాపారులపై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, న్యూసెన్సు చేస్తూ, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై దాడులు చేయాలని, వారిపై కేసులు నమోదు చేయాలని, పట్టుబడిన మైనర్లుకు, మందుబాబులకు కౌన్సిలింగు నిర్వహించాలని అధికారులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా సంబంధిత పోలీసు అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా లే-అవుట్లు, గ్రామ శివారు ప్రాంతాల్లోను, నగర శివారు ప్రాంతాల్లోను, బహిరంగంగా మద్యం సేవించిన వారిపై పోలీసు అధికారులు, సిబ్బంది డ్రోన్స్ తో దాడులు నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తూ, ప్రజాశాంతికి భంగం కలిగిస్తున్న మందుబాబులపై కేసులు నమోదు చేశామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. అదే విధంగా విద్యాసంస్థలకు 100మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రియాలు చేసే కిరాణా, పాన్ షాపు వ్యాపారులపై కూడా దాడులు చేపట్టామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై సి.ఓ.టీ.పి.ఎ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, వారిపై జరిమానాలు విధించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై జూలై 19న ఒక్కరోజునే 255 కేసులు నమోదు చేశారు. అదే విధంగా విద్యా సంస్థలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులు విక్రయించిన వారిపై 53 కేసులు నమోదు చేసి, జరిమానగా వారిపై రూ.8,500/- విధించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. మద్యం సేవించి, పట్టుబడిన మందుబాబులకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దని, ప్రజాశాంతికి భంగం కలిగించవద్దని, విద్యాసంస్థలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులను విక్రయించవద్దని సంబంధిత పోలీసు అధికారులు కౌన్సిలింగు నిర్వహించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

# ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం







**కొల్లిపర జులై20(లక్ష్యం న్యూస్) :** కొల్లిపర మండలం కుంచవరం గ్రామంలో ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఆదివారం జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు టి శ్రీనివాసరావు, కాకతీయ కోపరేటివ్ సొసైటీ చైర్మన్ డిఎల్ కాంతారావు అధ్యక్షతన జరిగిన శిబిరంలో పెనుగొండక్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) వారాహి మాతకు జ్యోతి ప్రజ్వలన చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఎపి ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ దేగల ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

గుంటూరు ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ వైద్యులు షుగరు, థైరాయిడ్, బిపి వ్యాధుల నిపుణులు డాక్టర్ అచింశెట్టి అన్వేష్, శ్వాస సంబంధిత వ్యాధుల వైద్యులు డాక్టర్ కాసుల సాయి రాజశేఖర్, గుండె సంబంధిత రోగ వైద్యులు డాక్టర్ తేజస్వి జల్లేపల్లి, ఎముకలు వైద్యులు డాక్టర్ చెరుకూరి జగదీష్, మెదడు, వెన్నుపూస నరముల వైద్య నిపుణులు డాక్టర్ బడుగు పవన్ కుమార్, జనరల్ సర్జరీ డాక్టర్ సురేష్, స్త్రీల సంబంధిత వ్యాధుల వైద్యులు డాక్టర్ జ్యోత్స్న ప్రియాంక, కంటి సంబంధిత వ్యాధుల డాక్టర్ మాధవిలత వైద్య శిబిరంలో పాల్గొన్నారు. గ్రామీణ పేదలకు కార్పొరేట్ వైద్య సేవలందించే లక్ష్యంగా పోస్ట్ సంస్థ చేస్తున్న ఔదార్యం మరువలేనిదని దేగల ప్రభాకర్ తెలిపారు. పోస్ట్ సంస్థ నిర్వహిస్తున్న ప్రజాసేవకు గుంటూరు ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ తమవంతు సహాయం చేస్తుందని ఆయన తెలిపారు. శిబిరంలో ప్రత్యేకంగా బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలు గ్రామాల నుంచి వచ్చిన 200 మంది ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగపరచుకున్నట్లు ప్రైమ్ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ శేషం ప్రదీప్ తెలిపారు.

# నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**- మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలి**

**- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**



**విశాఖపట్నం, లక్ష్యం ప్రతినిధి సతీష్ జూలై 20 :** 21వ తేదీన సోమవారం విశాఖపట్నం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం – పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని చెప్పారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్‌ను వాట్సఅప్ లో అందజేస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

**కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలి**

అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు. తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చున్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ ను సంప్రదించవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# అంగరంగ వైభవంగా శ్రీశ్రీశ్రీ వరహా లక్ష్మీనరసింహస్వామి నిత్య కళ్యాణం







**సింహాచలం లక్ష్యం ప్రతినిధి కనకరాజు జులై 20:** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు.

నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

### టౌన్ కార్యవర్గ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన మంగళగిరి ఆనంద్



**నరసరావుపేట జులై 20 (లక్ష్యం న్యూస్)::** నరసరావుపేట ప్రకాష్ నగర్ క్రిస్టియన్ యూత్ వారు మంగళగిరి ఆనంద్ కి హర్థిక శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం మంగళగిరి ఆనంద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు మరియు నరసరావుపేట నియోజకవర్గం శాసనసభ సభ్యులు చదలవాడ అరవింద్ బాబు మరియు కోటా కిరణ్ కి కృతజ్ఞతలు తెలిపారు తెలుగుదేశం పార్టీ లో కార్యకర్తగా ఉన్న నేను ఈరోజు టౌన్ వర్గ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేయడం నాకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు టీడీపీ పార్టీ ప్రతి ఒక కార్యకర్తను కులమత బేధాలు అనేది లేకుండా చూడగలిగే పార్టీ ఒక తెలుగుదేశం పార్టీ అని అన్నారు 14 వార్డ్ ప్రకాష్ నగర్ క్రిస్టియన్ యూత్ అనిల్, భరత్,కిరణ్, ప్రవీణ్,కిరణ్ రాజు,పీటర్,దేవానంద్,కృపా కిరణ్, లుక, అభినందనలు తెలిపారు,

## సాయిమంగావెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**తెనాలి జులై20(లక్ష్యం న్యూస్)** సమాజంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతులుగా ఉండాలనే సదుద్దేశంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించటం జరిగిందని సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కంకిపాటి రమేష్ కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక నాజరు పేట పుట్టా రాఘవయ్య రైస్ మిల్ సమీపంలోని తిరుపతమ్మ తల్లి గుడివద్ద సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ, అమరావతి సర్జికల్ కార్పొరేషన్, సుజాత హెల్త్ క్లినిక్, సిటీ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు ఈ మెడికల్ క్యాంపు ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగింది. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ పి. శ్రావణి 260 మందికి పైగా రోగులకు బిపి, షుగర్, థైరాయిడ్, గుండె జబ్బులు, గ్యాస్ సంబంధిత పరీక్షలు నిర్వహించి 80 వేల రూపాయల మందులను సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి బి సుధాకర్, సభ్యులు ఏవి. సత్యదేవ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాదల పూర్ణచంద్రరావు, గంజి శివ భుజంగ ప్రభాకరరావు, గోపితదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు అండగా సీఎం సహాయనిధి

### రూ.42.14 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేసిన పెమ్మసాని



గుంటూరు లక్ష్యం న్యూస్ జులై 20: "ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితుల్లో ఉన్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు సకాలంలో సాయం అందిస్తు పేదల జీవితాల్లో వెలుగు నింపుతోంది," అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని ఆయన తమ కార్యాలయంలో రూ.42,14,861 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పేద లబ్ధిదారులకు ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ సంక్షేమానికి నిదర్శనంగా నిలుస్తోందని, వైద్య అవసరాలు, ఆర్థిక సంక్షోభం వంటి క్లిష్ట పరిస్థితుల్లో ఈ నిధులు ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయని ఈ సందర్భంగా లబ్ధిదారులు భావోద్వేగంగా తెలిపారు.ఈ చర్య సీఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టిలో పేదలపట్ల ఉన్న మానవీయ దృక్పథాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. అన్ని వర్గాలకు ప్రభుత్వ సేవలు చేరేలా ఆయన తీసుకుంటున్న చర్యల్లో భాగంగా, పంపిణీ కార్యక్రమం ఎంతో కీలకంగా నిలుస్తోంది.ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నానికి సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జిఎంసి స్వచ్ఛ అచీవర్స్ అవార్డుల కార్యక్రమం వాయిదా



**గుంటూరు లక్ష్యం న్యూస్ జూలై 20 ::** జిఎంసి డివైసి, పిజిఆర్ఎస్ (గ్రీవెన్స్) యధావిదిగా ఉంటుంది..వాతావరణ శాఖ సూచనల మేరకు వర్షాలు మరో 2 రోజులు ఉండే అవకాశం ఉన్నందున సోమవారం ఉదయం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించాలి నిర్ణయించిన స్వచ్ఛ అచీవర్స్ పురస్కార సభ తాత్కాలికంగా వాయిదా వేయడమైనది .....
పురస్కార సభ వలన వాయిదా వేసిన జిఎంసి డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ లు యధావిదిగా జరుగుతాయన్న కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజలు ఉదయం 9:30 గంటల నుండి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ 0863-2224202, అనంతరం మధ్యాహ్నం 1 వరకు పిజిఆర్ఎస్ జరుగుతుందని తెలిపిన కమిషనర్

# 87 వ వార్డులో సుమారు రూ.5.89 కోట్ల వ్యయంతో

# పలు అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన



**విశాఖపట్నం లక్ష్యం ప్రతినిధి సతీష్ జూలై 20:** నగరంలో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన గాజువాక జోన్ 87 వార్డు పరిధిలోని వడ్లపూడి లో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథంతో కలిసి శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో పారిశ్రామిక ప్రాంతమైన గాజువాకను అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేయడం జరుగుతుందని, అందులో భాగంగా 87 వార్డు వడ్లపూడి లో జీవీఎంసీ నిధుల నుండి సుమారు 5.89 కోట్ల రూపాయలతో వి ఆర్ సి సి కాలువలు, దోబీ ఘాటు నిర్మించేందుకు గాజువాక శాసనసభ్యులతో కలిసి శంకుస్థాపన చేశామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖ నగర అభివృద్ధి తోపాటు సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. గాజువాక ప్రజలకు మౌలిక వసతుల కలపనే లక్ష్యంగా ప్రతి వార్డును అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం గాజువాక శాసనసభ్యులు మాట్లాడుతూ గాజువాక నియోజవర్గం పరిధిలో ప్రతి వార్డును ఆదర్శంగా తీసుకొని ప్రజలకు అందించే సంక్షేమం, మౌలిక వసతులు కల్పించేందుకు చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అలాగే జీవీఎంసీ నిధులనే కాకుండా ఎమ్మెల్యే నిధులను కూడా వెచ్చించి పలు అభివృద్ధి కార్యక్రమాలు నియోజవర్గం పరిధిలో చేపట్టడం జరుగుతుందని శాసనసభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, కార్పొరేటర్లు మొల్లి ముత్యాల నాయుడు, రౌతు శ్రీనివాసరావు, జీవీఎంసీ జోనల్ కమిషనర్ బి ఆర్ ఎస్ శేషాద్రి, కార్యనిర్వాహక ఇంజనీరు అప్పారావు, ఇతర నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



**విశాఖ,ఆనందపురం. లక్ష్యం ప్రతినిధి సతీష్ జులై 20:** వైసీపీ హయాంలో అన్ని రంగాల్లో కుదేలైన రాష్ట్రాన్ని మళ్లీ నెంబర్ వన్ గా నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం మండలం రామవరంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అందించిన అభివృద్ధిని.. సంక్షేమాన్ని వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ ఎన్నికల్లో చెప్పిన హామీలన్నీ నెరవేరుస్తున్న ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. రూ.2 వేల పెన్షన్ ను రూ.3 వేలు చేయడానికి జగన్మోహన్ రెడ్డికి అయిదేళ్లు పట్టిందని.. అధికారంలోకి వచ్చిన తక్షణమే చంద్రబాబు రూ.3 వేల పెన్షన్ ను రూ.4 వేలు చేశారని గుర్తు చేశారు. అలాగే 42 లక్షల మందికి అమ్మఒడి ఇవ్వగా, కూటమి ప్రభుత్వం దానికి 60 శాతం మించి 67 లక్షల మందికి తల్లికి వందనం అందిస్తోందని వివరించారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం, అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని వచ్చే నెలలో ఇవ్వనున్నట్టు చెప్పారు. ఎన్నికల హామీల్లో చెప్పినట్టు నిరుద్యోగ భృతి త్వరలోనే అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, రామవరం సర్పంచ్ ఎర్ర రాజు, తర్లువాడ సర్పంచ్ బి.ఆర్.బి. నాయుడు, శ్రీకాంత్ రాజు, గండ్రెడ్డి రమేష్, బలిరెడ్డి మల్లికార్జునరావు, అప్పల రాము తదితరులు పాల్గొన్నారు.

# గ్రానైట్ లారీలను అడ్డుకున్న జిఎస్టీ అధికారులు.

**-అధికారులతో వాగ్వివాదానికి దిగిన గ్రానైట్ అక్రమార్కులు.**

**-జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేసిన అధికారులు.**

**-గ్రానైట్ లారీలను అదుపు లోకి తీసుకొన్న పోలీసులు.**



**దాచేపల్లి, జూలై 20, లక్ష్యం ప్రతినిధి.** పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ అంతరాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద జిఎస్టీ అధికారులు 14 అక్రమ గ్రానైట్ లారీలను పట్టుకున్నారు.గత కొన్ని నెలలుగా ఎపీ లోని ఒంగోలు, మార్టూరు ల నుండి పల్నాడు జిల్లా లోని తంగెడ అంతరాష్ట్ర చెక్ పోస్ట్ ద్వారా ఎలాంటి బిల్లులు లేకుండా తెలంగాణా, ఇతర రాష్ట్రాలకు గ్రానైట్ ను అక్రమంగా తరలిస్తున్న 14 లారీలను జిఎస్టీ అధికారులు అడ్డుకున్నారు.దీంతో రెచ్చిపోయిన అక్రమార్కులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు.దీంతో అధికారులు పల్నాడు జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేయడం తో చెక్ పోస్ట్ వద్దకు చేరుకున్న దాచేపల్లి పోలీసులు ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 14 గ్రానైట్ లారీలను అదుపులోకి తీసుకుని దాచేపల్లి లోని మార్కెట్ యార్డు అవరణ కు తరలించి అధికారులకు అప్పగించారు.మూడు లారీలు తప్పించుకొని తెలంగాణ వైపు వెళ్ళగా,మిగిలిన 14 లారీల్లోని గ్రానైట్ ను లెక్కించి జరిమానా విధించినట్లు తెలిసింది.

# సుబ్బమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి కామేశ్వరి అమ్మవారి 25వ వార్షికోత్సవం

తాడికొండ,జూలై20గుంటూరు రూరల్ మండలం పరిధిలోని జొన్నలగడ్డలో త్రయాహ్నిక దీక్షతో శుక్ర,శని, ఆదివారాలలో సంగాపు సుబ్బమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో
శ్రీ లక్ష్మి కామేశ్వరి అమ్మవారి 25వ వార్షికోత్సవ త్రయాహ్నిక కార్యక్రమ పూర్ణాహుతి సందర్భంగా సభా కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి తొలుతగా జ్యోతి ప్రజ్వలన వేద పఠనంతో కార్యక్రమం ప్రారంభం అయ్యింది. శైవాగమ ప్రముఖులు నాగలింగం హరిహరపంత్ సభకు అధ్యక్షత వహిస్తూ సంఘటితం అనేది మహోన్నతమైనదని ప్రతి వ్యక్తి తోటి వ్యక్తులతో కలిసి సంఘటితంగా సంఘాన్ని నిర్మించి తమ సమస్యల పట్ల పరిష్కారాన్ని సాధించాలని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆంధ్ర రాష్ట్ర ఆది శైవ అర్చక సంఘ ప్రధాన కార్యదర్శి పత్రి అనిల్ కుమార్ మాట్లాడుతూ అర్చక సమస్యల పరిష్కారంలో తమ సంఘం ముందు ఉంటుందని నిరంతరం అర్చకునికి అండగా నిలబడుతుందని అన్నారు. మరో ముఖ్య అతిథి సహస్రాధిక ప్రతిష్టాచార్యులు మామిళ్ళపల్లి మృత్యుంజయ ప్రసాద్ శివాచార్య మాట్లాడుతూ శ్రీ శ్రీ శ్రీ జగద్గురు శ్రీ కంఠ శివాచార్యుల వారు శివుని యొక్క వరంతో నిత్య యవ్వనంగా ఉండి శివారాధనకు దిశా నిర్దేశ నిర్ణయించిన ఆది శైవుల ప్రధమ గురువు అని అన్నారు.ఈ గురువర్యుని ప్రతి ఒక్కరు నిరంతరం ఆరాధించి ప్రార్థించి ప్రచారం చేయాలని అర్చకలోకానికి పిలుపునిచ్చారు.రాష్ట్ర కోశాధికారి మురికిపూడి కృష్ణ కిషోర్ మాట్లాడుతూ సంఘ విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర సంఘ సహాయ కార్యదర్శి కొల్లిపర నాగేశ్వరావు మాట్లాడుతూ అర్చకుల మధ్య పరస్పర సహకారం అవసరం అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కొల్లిపర నాగ కోటేశ్వర శర్మ,ఆధునిక కవి చందులూరి నారాయణరావు మాట్లాడుతూ అర్చకులు సంఘటితంగా సాహిత్య సంగీతలలో ముందుండాలని అన్నారు.గౌరవ సభ్యులు పుల్లేటికుర్తి సత్య సుబ్రహ్మణ్య వరప్రసాద్,గుంటూరు జిల్లా ఆంధ్ర రాష్ట్ర ఆది శైవ అర్చక అధ్యక్షులు కొలకలూరి శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ అర్చకుల సేవలు తమ వంతు పాత్ర అన్ని సందర్భాలలో అందుబాటులో ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి పోగుల మురళీకృష్ణ శర్మ కోశాధికారి పార్వతీశ్వరయ్య శర్మ,జిల్లా మహిళా ప్రతినిధి రాష్ట్ర మహిళా ప్రతినిధి పత్తిపాటి కాత్యాయని,రాష్ట్ర మహిళా ప్రతినిధి కొల్లిపర శర్వాణి మాట్లాడుతూ అర్చకత్వం నిర్వహించే అర్చకులకు భాగ స్వామి అయిన శ్రీమతులు అండదండలతో విశేష సేవలు అందించాలని అన్నారు.మరో రాష్ట్ర మహిళా ప్రతినిధి పొన్నూరు బసవభారతి మాట్లాడుతూ అర్చకుల సంఘటితం ఉత్తమమైనదని అన్నారు.రాష్ట్ర సంఘ కార్యాలయ ఇంచార్జ్ పొన్నూరు భుజంగరావు,రాష్ట్ర మహిళా ప్రతినిధి బసవభారతి, ప్రసాద్ గారు తదితరులు పాల్గొన్నారు. తొలుతగా గుంటూరుకు చెందిన హేమశ్రీ నాట్యంతో కార్యక్రమం ప్రారంభమైంది.ఈ సందర్భంగా ఆధునిక కవి చందలూరి నారాయణరావు రచించిన ఏకాంత స్పర్శ గ్రంథ ఆవిష్కరణ జరిగింది.ఈ సందర్భంగా ట్రస్ట్ తరపున పెనుమూడి వెంకటేశ్వరరావు,సాంబశివరావు, శివనాగ మల్లేశ్వరరావు, పెనుమూడి కామేశ్వరరావు, పెనుమూడి సుబ్బారావు తదితర ట్రస్ట్ నిర్వాహకులు వివిధ రంగాలలో విశేష సేవలను అందించిన వారిని సత్కరించి, విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు నగదు బహుమతితో సత్కరించి ప్రోత్సహించారు.



ప్రజా చైతన్యమే...
# లక్ష్యం
తెలుగు దినపత్రిక

సోమవారం 21 జూలై 2025

## మంగళగిరి అంబేద్కర్ సెంటర్లో కళారూపాలు ప్రదర్శిస్తున్న

# గుంటూరు జిల్లా ప్రజానాట్యమండలి కళాకారులు



**మంగళగిరి జూలై 20(లక్ష్యం న్యూస్)**ఈ సందర్భంగా జరిగిన సభకు ప్రజానాట్య మండల గుంటూరు జిల్లా అధ్యక్షురాలు పద్మ అధ్యక్షత వహించారుఈ సభలో అతిధిగా పాల్గొన్న ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్ మాట్లాడుతూ,సమాజంలో ఉన్న రుగ్మతలకి, సమస్యలకి పరిష్కారాలను చూపడానికి ప్రజా కళాకారులు అనేక కొత్త కళారూపాలు సృష్టించి ప్రజలను చైతన్యవంతం చేయడానికి ప్రజానాట్యమండలృషి చేస్తుందని అన్నారు మనుషుల మధ్య సామరస్యత భావాన్ని పెంపొందించడానికి కళాకారులు కృషి చేయాలని ,విద్వేషాలు సృష్టించే వారి ఎత్తుగడలను తిప్పి కొట్టాలని ఆయన అన్నారుప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై ప్రజానాట్యమండలి కళాకారులు గళాలు విప్పాలని ఆయన కోరారు కళారూపాల ద్వారా ప్రజలు త్వరగా చైతన్యమవుతారని అన్నారు

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం కూటమి ప్రభుత్వాలు కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ సామాన్య ప్రజలపై భారాలు మోపుతున్నాయనిస్మార్ట్ మీటర్లు పెట్టి విద్యుత్ బారాలు పెంచి అదానీకి లాభం చేకూర్చే విధంగా పాటుపడుతున్నారని, కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం ద్వారా పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను, చట్టాలను కాలరాస్తున్నారని అన్నారురైతులకు వారు పండించిన పంటకు కనీసం మద్దతు ధర ఇవ్వాలని, నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరారుదేశ స్వాతంత్రం కోసం పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ స్వాతంత్ర పోరాట చరిత్రకి సంబంధం లేనటువంటి వ్యక్తుల గుట్టు రట్టు చేసేలా కళారూపాలని సృష్టించి ప్రజలను చైతన్య పరుస్తామని అన్నారు అధిక ధరలకు వ్యతిరేకంగా, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కుల, మత ద్వేషాలకు వ్యతిరేకంగా మనుషులందరినీ సంఘటిత పరచడానికి ఈ కళారూపాలు దోహదపడతాయని తెలిపారుసిఐటియు జిల్లా నాయకులు ఎం రవి మాట్లాడుతూ రాజధాని అమరావతిలో కష్టజీవులకు, కార్మికులకు కర్షకులకు న్యాయం చేయకుండా కార్పొరేట్లకు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఊడిగం చేసేలా కూటమి ప్రభుత్వ చర్యలు ఉన్నాయని అన్నారు

ప్రజా రాజధానిగా అమరావతిని నిర్మించాలని గతం నుండి కోరుతున్నామని సామాన్య ప్రజలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో సంతోషంగా జీవించేలా రాజధాని నిర్మాణం చేపట్టాలని కోరారు, మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు సమ్మెకు మద్దతుగా ప్రజా కళాకారులు నిలవాలని కోరారు కళ కళ కోసం కాదు ప్రజల కోసం అన్న గరికపాటి రాజారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్న కళాకారులు అందరికీ అభినందనలు తెలిపారు

ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు ఆర్ వి రాఘవయ్య లూథర్ పాల్ సుమ రాజ్యలక్ష్మి పార్వతి ప్రసాద్ బాలాజీ బుజ్జిబాబు గాలి శ్రీనివాస్ రావు శ్రీధర్ రాజమోహన్ సాంబశివరావు ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో తిరిగొచ్చే ఈ టూరిస్ట్ స్పాట్స్ తెలుసా !



సెలవురోజు, వీకెండ్ వచ్చిందంటే చాలు.. అందమైన పర్యాటకం.. అనురాగాల ప్రయాణం అంటూ.. నగరవాసులు విహార యాత్రలకు జై కొడుతున్నారు. హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో చూడగల పర్యాటక ప్రాంతాలను వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు. సెలవురోజు, వీకెండ్ వచ్చిందంటే చాలు.. అందమైన పర్యాటకం.. అనురాగాల ప్రయాణం అంటూ.. నగరవాసులు విహార యాత్రలకు జై కొడుతున్నారు. ఉరుకులు..పరుగుల జీవన ప్రయాణంలో ఇల్లూ.. ఆఫీసుల మధ్య పనుల ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులు.. కాసేపు ప్రకృతి ఒడిలో ఓలలాడుతున్నారు. మరీ కొత్త ప్రదేశాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా.. కాస్త పరిచయం ఉన్న చోట్లకే టూర్లు వేసుకుంటున్నారు. హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో చూడగల పర్యాటక ప్రాంతాలను వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**లక్నవరం సరస్సు..** నగర పర్యాటకులను ఆకర్షించే ముఖ్యమైన వాటిల్లో లక్నవరం ఒకటి. హైదరాబాద్ నుంచి 220 కిలో మీటర్లు. ఈ ప్రదేశం చుట్టుపక్కల ఉండే ఏటూరునాగారం అభయారణ్య సందర్శకులను కనువిందు చేస్తున్నది. లేక్ క్రాసింగ్, రోప్ కోర్సులు, కయాకింగ్ వంటివి అందుబాటులో ఉంటాయి. దీనికి సమీపంలో బొగత జలపాతం కూడా కనువిందు చేసే పర్యాటక ప్రాంతం.

**శామీర్‌పేట్ లేక్..** హైదరాబాద్ శివారు ప్రాంతమైన శామీర్‌పేట్ సికింద్రాబాద్‌కు 20 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ ఎన్నో విలాసవంతమైన రెస్టారెంట్లు, హోటళ్లు ఉన్నాయి. ఇక్కడ ఉన్న జింకల పార్క్‌లో జింకలతో పాటు నెమళ్లు, అనేక రకాల పక్షులు కనిపిస్తాయి.

**డిండి..** నల్గొండ జిల్లాలో ఉంది. హైదరాబాద్ నుంచి 108 కిలోమీటర్ల దూరం. సుమారు 2:30 గంటల జర్నీ. ప్రశాంత వాతావరణానికి మారుపేరుగా ఉన్న డిండిలో సుందరమైన దృశ్యాలు అనేకం. ట్రెక్కింగ్, బ్యాక్ వాటర్ ట్రిప్స్‌తో ఎంజాయ్ చేయొచ్చు. శ్రీశైలానికి వెళ్లేదారిలో డిండిని చూసేందుకు పర్యాటకులు ప్రత్యేక ఆసక్తి చూపిస్తారు. నీటి అందాలతో సెల్ఫీలు దిగి సందడి చేస్తారు.

**కొండపోచమ్మ..** నూతనోత్తేజాన్ని నింపే అత్యుత్తమ క్యాంపింగ్ ప్రదేశంగా దీనిని చెప్పవచ్చు. హైదరాబాద్‌కు 50 కిలో మీటర్ల దూరంలో ఉంది. సిద్దిపేట జిల్లాలో ఉన్న ఈ రిజర్వాయర్ అందాలు ప్రత్యేకం. వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. అందుకే ఇక్కడ క్యాంపింగ్ చేసేందుకు అధిక శాతం పర్యాటకులు ఆసక్తి చూపుతారు.

**అనంతగిరి..** ట్రెక్కింగ్ కోరుకునే వారికి అనంతగిరి స్వర్గధామం. వికారాబాద్‌కు కేవలం పది కిలోమీటర్లు.. హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. అనంతగిరి కొండల చుట్టుపక్కల ఉన్న అటవీ ప్రాంతం.. నిర్మలమైన వాతావరణం పర్యాటకులను ఆకర్షిస్తోంది. ప్రాచీనమైన అనంతగిరి పద్మనాభ స్వామి ఆలయాన్ని కూడా దర్శించుకోవచ్చు.

**కీసరపోదాం..** ఆధ్యాత్మిక ప్రాంతంగా పరిఢవిల్లుతున్న కీసర.. పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి. పక్షుల కిలకిలరావాలు.. 'హరితహారం'తో స్వాగతం పలికే చెట్లు.. సుందరీకరణతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న చెరువులు.. నలువైపులా వీక్షించేలా కొండపై కొలువుదీరిన వ్యూ పాయింట్స్.. అచ్చు ప్రకృతి సంపదతో నిర్మించినట్టుగా అనుభూతి కలిగించే ఆర్నమెంటల్ ఫెన్సింగ్.. ఆరోగ్యాన్ని పంచే ఔషధ మొక్కల కూడళ్లు.. నలువైపులా పరుచుకున్న పచ్చదనంతో కీసర.. పర్యాటకుల డెస్టినేషన్ లిస్టులో మొదటివరుసలోకి చేరింది. సుమారు 1562 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అటవీ ప్రాంతంలో విభిన్న రకాల మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

**రాచకొండ కోట..** నగరం నుంచి 65 కిలో మీటర్ల దూరం. ఇది 14వ శతాబ్దానికి చెందిన కోట. ట్రెక్కింగ్‌కు అనుకూలం. యాదాద్రి-భువనగిరి జిల్లాలో ఉంది. కోట పై నుంచి చూస్తే ఆకుపచ్చని ప్రాంతాల అందాలు కనువిందు చేస్తాయి. హైదరాబాద్ నుంచి 207 కిలోమీటర్ల దూరం. సుమారు 4 గంటల జర్నీ. ఉత్తర తెలంగాణ జిల్లాకు వరప్రదాయిని. గోదావరి నది మీద కట్టిన ఈ ప్రాజెక్టును చూసేందుకు సంద ర్శకులు ఆసక్తి చూపిస్తారు. బడా పహాడ్ దర్గా, ఖిల్లా జైలు, సిర్నాపల్లి గడీ, డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం, దేవల్ మసీద్, కందకూర్తి త్రివేణి సంగమం, రామడుగు జలాశయం, అలీసాగర్ తదితర పర్యాటక ప్రాంతాలన్నింటినీ వీక్షించొచ్చు.

ప్రముఖ పుణ్యక్షేత్రం ఇది. హైదరాబాద్ నుంచి 5 గంటల ప్రయాణం. సుందరమైన దృశ్యాలకు నెలవు. కృష్ణా నదిపై నిర్మించిన శ్రీశైలం ఆనకట్టను వీక్షించొచ్చు. అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో ఇది ఒక్కటి. నది ఒడ్డున ఉన్న 12 జ్యోతిర్లింగాల్లో ఒకటైన మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించొచ్చు. భ్రమరాంబదేవి , సాక్షి గణపతి దేవాలయాలు న్నాయి. ప్రకృతి అందాలను వీక్షించొచ్చు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులే కాదు.. నగరానికి చేరువలో అనేక జలపాతాలున్నాయి. అందులో బొగత, నిర్మల్ జిల్లాలో కుంటాల, పొచ్చెర వంటివి ఉన్నాయి.

**నల్లమల అడవులు..**నగరం నుంచి 219 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో క్యాంపింగ్ చేయడం ఎంతో కిక్కిస్తుంది. ప్రకృతివనంలో ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. చుట్టూ ప్రకృతి అందాలతో నిండిన ఈ ప్రాంతంలో పర్యాటకుల సాహసాలను, ఉత్కంఠభరితమైన కార్యకలాపాలను ఆస్వాదించొచ్చు. సాహస భరిత అనుభూతిని పొందేందుకు సరైన డెస్టినేషన్ ఇది. పర్వతారోహణ, శివాలయం, కంబం సరస్సు అందుబాటులో ఉండే ప్రాంతాలు.

**సిటీ చుట్టూ థీమ్‌లు..** ఓఆర్ఆర్ నుంచి 25 కిలోమీటర్ల పరిధిలో పదికి పైగా ఉన్న థీమ్ పార్కులు పర్యాటకులకు ఎంతగానో చేరువయ్యాయి. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా రావిర్యాలలోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.13 వద్ద అందుబాటులో ఉంటే వండర్ లా, శంషాబాద్ ఎయిర్ పోర్టు సమీపంలోని ఎస్కేప్ అడ్వెంచర్ వాటర్ థీమ్ పార్కు, శంకర్‌పల్లిలోని వైల్డ్ వాటర్ అమ్యూజ్‌మెంట్, వికారాబాద్ సమీపంలో ఉండే డ్రీమ్ వ్యాలీ వాటర్ పార్కులు, వికారాబాద్, భువనగిరి గుట్టల సమీపంలో ఉండే ట్రెక్కింగ్ స్పాట్లకు ప్రైవేటు టూర్ ఆపరేటర్లతోపాటు తెలంగాణ టూరిజం శాఖ కూడా టూర్లను ఆపరేట్ చేస్తున్నది. వీటికి సిటీ నుంచి గంటన్నర వ్యవధిలోనే చేరుకునే వీలు ఉండగా.. ఒకప్పుడు సిటీ దాటి వెళ్లేవారు కూడా ఈ ప్రాంతాలను ఒక్కసారైన సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**ఋబ్బురపరిచే పార్కులు..** హైదరాబాద్ శివారులోనే ఉన్న కండ్లకోయ ఆక్సిజన్ పార్కును అడవిలాంటి ఉద్యాన వనం అనవచ్చు. అటవీశాఖ 75 ఎకరాల విస్తీర్ణంలో తీర్చిదిద్దిన ఈ పార్కులో 50 వేల పైచిలుకు చెట్లున్నాయి. పెద్దల కోసం యోగా హాల్, వాక్‌వేలు ఉన్నాయి. పిల్లలకు ఆట స్థలాలున్నాయి. ట్రీహౌస్, పక్షులు సీతాకోకచిలుకల పార్కులు ఉన్నాయి. కుటుంబమంతా కలిసి పిక్నిక్ వెళ్లడానికి చక్కని చోటు ఇది. అలాగే కొత్తగూడలో 120 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బొటానికల్ గార్డెన్స్ ఆహ్లాదాన్ని పంచుతున్నది.

# యూరప్‌లోని ఆ రెండు దేశాలు ఉద్యోగులకు డిజిటల్ నోమాడ్ వీసాలను అందిస్తున్నాయి..

అలాంటి వారికే ఇప్పుడు యూరప్‌లోని రెండు దేశాలు డిజిటల్ నోమాడ్ వీసాలను జారీ చేస్తున్నాయి. దీంతో ఉద్యోగులు ఇకపై ఆయా దేశాలకు వెళ్లి మరీ తమ పనులు కొనసాగించుకోవచ్చు. ఆ విశేషాల గురించి పూర్తిగా తెలుసుకుందాం.

**డిజిటల్ నోమాడ్ వీసాలంటే..**

ఈ కొత్త వీసాల విధానంతో ఉద్యోగులు తమ సొంత దేశంలో కాకుండా ప్రపంచంలోని ఉత్తమ ప్రదేశాల్లో విహరిస్తూ పని చేసుకునే సౌలభ్యం ఉంటుంది. ఇది ఒక విధంగా చెప్పాలంటే వర్క్ ఫ్రం అదర్ కంట్రీస్‌గా చెప్పుకోవచ్చు. అందుకు అనుగుణంగానే అనేక దేశాలు ఎక్కువ మంది సందర్శకులను ఆకర్షించడానికి డిజిటల్ నోమాడ్ వీసాలను అందిస్తున్నాయి. తాజాగా ఆ జాబితాలో స్పెయిన్, పోర్చుగల్ చేరాయి. నివేదికల ప్రకారం 30 కన్నా ఎక్కువ దేశాలు పని చేసే నిపుణులకు, స్వయం ఉపాధి చేసుకునేవారికి ఈ 'డిజిటల్ నోమాడ్ వీసా'లను అందిస్తాయి. దీంతో సదరు వ్యక్తులు ఆయా దేశాల్లోని మారుమూల ప్రాంతాల నుండి కూడా పని చేసుకునేందుకు అనుమతిస్తారు.

**అదంత సులువేం కాదు..**

అయితే, డిజిటల్ నోమాడ్ వీసాలు పొందడం అంత సులువైన పనేంకాదు. అందుకు సంబంధించిన అర్హత ప్రమాణాలు చాలా కఠినమైనవనే చెప్పాలి. అందులో అతి ముఖ్యమైనది కనీస బ్యాంక్ బ్యాలెన్స్ కలిగి ఉండటం లేదా ఆయా దేశాలను బట్టి మారే నిర్దిష్ట ఆదాయాన్ని సంపాదించడం. ఉదాహరణకు పోర్చుగల్‌ను తీసుకుంటే.. ఆ దేశంలో కనీస వేతనం కన్నా పర్యాటకులు నాలుగు రెట్లు సమానమైన నెలవారీ ఆదాయాన్ని కలిగి ఉండాలి. అలా ప్రస్తుత కరెన్సీ ప్రకారం లెక్కిస్తే నెలకు ఆ3,040 పోర్చుగల్‌లో సంపాదిస్తే అది మనవద్ద సుమారు ?2.7 లక్షలు కలిగి ఉండాలి. అలా మీరు కూడా ఆ రెండు యూరప్ దేశాల్లో ఎక్కడైనా విహరిస్తూ వర్క్ చేసుకోవాలనుకుంటే అందుకు సంబంధించిన విషయాలను ఇక్కడ తెలుసుకోవచ్చు.

**స్పెయిన్ వీసా కావాలంటే..**

స్పెయిన్ అందించే డిజిటల్ నోమాడ్ వీసా పొందాలనుకుంటే వారు స్వయం ఉపాధి కలిగి ఉండాలి. అందుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు చూపించాలి. ఫ్రీలాన్సర్లు వారి పనికి సంబంధించిన రుజువులను, ఆర్థిక వనరులను చూపించాలి. అలాగే స్పెయిన్‌లో కాకుండా ఇతర దేశాల్లో ఉన్న కంపెనీల్లో పనిచేసే వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వారికి రిమోట్‌గా పని చేయడానికి గల అనుమతులు ఉండాలి. స్పానిష్ సంస్థల నుండి గరిష్ఠంగా 20 శాతం సంపాదించే వారు కూడా ఈ వీసా పొందడం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే యూరోపియన్ యూనియన్ లేదా యూరోపియన్ ఎకనామిక్ ఏరియాలో నివసించని వారు, స్పెయిన్‌లో చట్టవిరుద్ధంగా నివసించని వ్యక్తులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

**అక్కడ ఎంతకాలం ఉండొచ్చు..**

ప్రస్తుతం స్పెయిన్ ఈ వీసాలను ఒక ఏడాది కాలవ్యవధితో అందిస్తోంది. అయితే, ఒక వ్యక్తి స్పెయిన్‌లో టూరిస్ట్ వీసాపై ఉన్నట్లయితే వారు అక్కడి నుండే మూడు సంవత్సరాల పాటు ఉండేందుకు %ణచీఎ% కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత వారి వీసాను ఐదు సంవత్సరాల వరకు పునరుద్ధరించుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. అది కూడా వారు ఏడాదిలో ఆరు నెలల పాటు స్పెయిన్‌లో ఉంటేనే అర్హులవుతారు.

**పోర్చుగల్ వీసా కావాలంటే..**

ఇక పోర్చుగల్ డిజిటల్ నోమాడ్ వీసా కోసం ఎవరైనా స్వయం ఉపాధి పొందేవారు, ఫ్రీలాన్సర్లు, వారి పనికి రుజువును చూపించుకోగల వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చు.

## చీరాల ఆవోపా సేవా కార్యక్రమాలు అభినందనీయం

### శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య



**చీరాల జులై 20 ( లక్ష్యం న్యూస్)** పట్టణంలో ఆవోపా చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతైనా అభినందనీయమని శాసనసభ్యులు మద్దులూరి మాల కొండయ్య అన్నారు. ఆదివారం స్థానిక కిరాణా మర్చంట్స్ కళ్యాణమండపం నందు చీరాల అవోపా నిర్వహిస్తున్న చదువుల పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ని ఆవోప కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అవోపా నిర్వహిస్తున్న ఈ చదువుల పండుగలో 109 మంది విద్యార్థులకు రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాలు, 80 మంది విద్యార్థులకు వడ్డీలేని విద్యారుణాలు, 64 మంది విద్యార్థులకు ఉచిత చేయూత పురస్కారాలు, 40 మందికి వడ్డీలేని ఉపాధి రుణాలు, వీటితోపాటు వడ్డీలేని రుణంగా ఐదుగురు విద్యార్థులకు ల్యాప్టాప్ కంప్యూటర్లు, మొత్తంగా 250 మంది ఆర్యవైశ్య విద్యార్థులకు దాదాపు 25 లక్షల రూపాయల విలువైన సహాయం అందించారు. సహాయం అందించిన దాతలందరికీ ఆవోప కమిటీ తరపున ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈనాటి కార్యక్రమంలో కొత్తమాసు శివ, రంగనాయకులు, మువ్వల వెంకట రమణారావు, బొలిశెట్టి మురళీకృష్ణ, బొలిశెట్టి రమేష్ కుమార్, పోలిశెట్టి ప్రేమ్ కుమార్, ఆవోపా వలివేటి మురళీకృష్ణ, ప్రెసిడెంట్ పోలిశెట్టి శ్యామసుందరరావు, సెక్రటరీ పేర్ల వెంకటరామయ్య, ట్రెజరర్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ గా జవ్వాది ప్రమాణ స్వీకారం



మంగళగిరి జూలై 20(లక్ష్యం న్యూస్)మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గా జవ్వాది కిరణ్ చంద్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం మంగళగిరి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు యార్డ్ చైర్మన్ గా జవ్వాది కిరణ్ చంద్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ తో పాటుగా వైస్ చైర్మన్ ఎర్రగుంట్ల భాగ్య రావు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్లుగా నైనాలా లావణ్య జగ్గరపు నాగకుమారి, బైరబోయిన పద్మావతి, నల్గొండ పరమేశ్వరరావు, వీరిశెట్టి శ్రీనివాసరావు, మేడిశెట్టి కిషోర్, మన్యం మల్లేశ్వరి, ఉయ్యాల శ్రీనివాసరావు, షేక్ మస్తాన్, షేక్ తస్లీమా, ఎంద్రెడ్డీ విజయ్ కుమార్ రెడ్డి, వల్లభాపురం స్వర్ణకుమారి, నక్క రాజేశ్వరి లు ప్రమాణస్వీకారం చేశారు.ముందుగా మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామం నుంచి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా బయలుదేరి మంగళగిరి పురవీధుల గుండా మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. మార్కెట్ యాడ్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన జవ్వాది కిరణ్ చంద్ ను పలువురు ప్రముఖులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మంగళగిరి మార్కెట్ యార్డ్ కార్యదర్శి పి ప్రభారాణి,టిడిపి గుంటూరు జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్ టీడీపీ గుంటూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, తెలుగు యువత అధ్యక్షులు పడవల మహేష్, టిడిపి కృష్ణాయ పాలెం గ్రామ అధ్యక్షులు ఆవల రవి కిరణ్, ఆరుద్ర సత్యం, మాదాల రమేష్ బాబు, దానబోయిన సుందర్రావు యాదవ్, కూటమి నాయకులు, కార్యకర్తలు, జవ్వాది అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## చలో ఊటీ..

## రూ. 9వేలకే ఆరు రోజుల ట్రిప్. పూర్తి వివరాలు

చాలా మంది టూర్‌లకు ప్లాన్‌లు చేస్తున్నారు. మీలాంటి వారి కోసమే తెలంగాణ టూరిజం ప్రత్యేకంగా ఓ మంచి టూర్ ప్యాకేజీని అందిస్తోంది. హైదరాబాద్ నుంచి ప్రారంభమయ్యే ఈ టూర్ కర్ణాటకలోని పలు ప్రాంతాల మీదుగా సాగుతుంది. మొత్తం 5 రాత్రులు, 6 రోజులుగా వేసవి సెలవులు ముగిసేందుకు సమయం దగ్గరపడింది. దీంతో చాలా మంది టూర్‌లకు ప్లాన్‌లు చేస్తున్నారు. మీలాంటి వారి కోసమే తెలంగాణ టూరిజం ప్రత్యేకంగా ఓ మంచి టూర్ ప్యాకేజీని అందిస్తోంది. హైదరాబాద్ నుంచి ప్రారంభమయ్యే ఈ టూర్ కర్ణాటకలోని పలు ప్రాంతాల మీదుగా సాగుతుంది. మొత్తం 5 రాత్రులు, 6 రోజులుగా ఈ ట్రిప్ సాగుతుంది. బెంగళూరు – ఊటీ – మైసూర్ పేరుతో తీసుకొచ్చిన ఈ టూర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి వివరాలు మీకోసం..

**మొదటి రోజు:** టూర్‌లో భాగంగా తొలి రోజు మధ్యాహ్నం హైదరాబాద్‌లో టూర్ ప్రారంభమవుతుంది. యాత్రి నివాస్ నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు, బషీర్‌బాగ్ నుంచి సాయంత్రం 4 గంటలకు బస్సు బయలుదేరుతుంది. రాత్రంతా ప్రయాణించి ఉదయం బెంగళూరు చేరుకుంటారు.

**రెండో రోజు:** రెండో రోజు బెంగళూరులో లోకల్ సైట్ విజిటింగ్ ఉంటుంది. ఇందులో భాగంగా బుల్ టెంపుల్, లాల్ బాగ్, విశ్వేశ్వరయ్య మ్యూజియం, ఇస్కాన్ టెంపుల్ విజిటింగ్ ఉంటుంది. రాత్రి బెంగళూరులోనే బస చేయాల్సి ఉంటుంది.

**మూడో రోజు:** ఇక మూడో రోజు తెల్లవారుజామున 4 గంటలకు ఊటీ బయలుదేరాల్సి ఉంటుంది. మధ్యాహ్నానికి ఊటీ చేరుకుంటారు. ఆ తర్వాత లోకల్ సైట్‌సీయింగ్ ఉంటుంది. దొడ్డపెట, బొటానికల్ గార్డెన్ చూడొచ్చు. భోజనం తర్వాత రాత్రి ఊటీలో బస ఉంటుంది.

**నాలుగో రోజు:** టూర్‌లో నాలుగో రోజు ఉదయం మైసూర్ వెళ్తారు. సాయంత్రానికి మైసూరు చేరుకుంటారు. అనంతరం బృందావన్ గార్డెన్ సందర్శన ఉంటుంది. రాత్రికి భోజనం, మైసూరులో బస ఉంటుంది.

**ఐదో రోజు:** ఐదో రోజు ఉదయం 7 గంటలకు మైసూరు లోకల్ సైట్‌సీయింగ్ ఉంటుంది.

Printed,Published and owned by CHALLA MADHUSUDHANA RAO,and Printed at VEERENDRA GRAPHICSD.NO.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001. Guntur Dist, A.P.
and Published at D.No.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001, Guntur Dist, A.P. R.N.I. No. APTEL/2013/48712 Editor : CHALLA MADHUSUDHANA RAO